ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నిర్మల్

16

శనివారం 6 జనవరి 2018

శుక్రవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 24.0 । కనిష్ఠం 13.0



ముగ్గుల పోటీలకు ముస్తాబైన హరిహరక్షేత్రం




6

ముగ్గుల పోటీలు నిర్వహించే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ప్రముఖులు

నిర్మల్ పట్టణంలోని మల్లన్న గుట్ట వద్ద గల హరిహరక్షేత్రంలో శనివారం 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి.

ఈ పోటీలకు మహిళలందరూ ఆహ్వానితులే..

ప్రక్షాళన పూర్తి



14



- పక్కాగా భూముల లెక్క
- జిల్లాలో 8.65 లక్షల ఎకరాల భూ ప్రక్షాళన
- గత సెప్టెంబర్‌లో ప్రారంభించిన కార్యక్రమం
- 428 రెవెన్యూ గ్రామాల్లో విధుల నిర్వహణ
- ఒక్కో గ్రామంలో పది రోజుల పాటు మకాం
- గడువులోగా పూర్తి చేసిన సిబ్బంది
- ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

జిల్లాలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 428 రెవెన్యూ గ్రామాల్లో 8,65,625 ఎకరాల భూ ప్రక్షాళన పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గత సెప్టెంబర్‌లో ప్రారంభించిన భూ ప్రక్షాళన గడువులోగా పూర్తయిన నేపథ్యంలో.. జిల్లాలో భూముల ప్రక్షాళన దాదాపు పూర్తయినట్లే! ఒక్కొక్క గ్రామంలో పది రోజుల పాటు అధికారుల బృందం మకాం వేసి భూముల లెక్కలను పక్కాగా తేల్చింది. రాబోయే రోజుల్లో వ్యవసాయదారులకు సీఎం కేసీఆర్ అందించే పంట పెట్టుబడి ఈ భూప్రక్షాళన ఆధారంగానే కానుండడంతో వ్యవసాయ కుటుంబాలు తమ భూములను భూ ప్రక్షాళనలో నిర్ధారించుకొని ప్రభుత్వం నుంచి గుర్తింపు పత్రం పొందాయి. ఎమ్మెల్యేలను సైతం భూ ప్రక్షాళన కార్యక్రమం పూర్తయ్యే వరకు నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించాలని సీఎం ఆదేశించడంతో వారంతా భూ ప్రక్షాళనపైనే దృష్టి సారించి విజయవంతం చేశారు. (ఆంధ్రజ్యోతి, నిర్మల్)

టమారా



- రూ.2లకు పడిపోయిన కిలో ధర
- దక్కని లాభం .. ఆశలు ఆవిరి
- విస్తీర్ణం పెరిగినా ప్రయోజనం శూన్యం
- అధిక ఖర్చులతో మరింత భారం
- కొనుగోళ్లు లేక పారవేస్తున్న అన్నదాతలు

6

పార్టీ పటిష్ఠతకు కృషి

6



- జిల్లాలో భారతీయ జనతా పార్టీని పటిష్ట పరిచి రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారం కైవసం చేసుకునేందుకు కృషి చేస్తా
- నూతనంగా నియమితులైన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి

అమ్మవారిని దర్శించుకున్న త్రిపుర డీజీపీ

16



బాసర సరస్వతీ అమ్మవారిని శుక్రవారం త్రిపుర రాష్ట్ర డీజీపీ నాగరాజు కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు ఆయన్ను సన్మానించారు.



వ్యాఖ్యానంలో వెంకట్

క్రీడా వ్యాఖ్యాతగా వెంకట్ సత్తా

'కబడ్డీ... కబడ్డీ... కబడ్డీ..' అంటూ కూతకు వెళ్లడం ఎంత కష్టమో, ఆ ఆటకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం కూడా అంతే కష్టం! 30 సెకన్ల గరిష్ఠ సమయంలోనే బరిలో ఏం జరుగుతుందో టీవీ వీక్షకులకు కళ్లకు కట్టినట్టుగా చెప్పేయాలి. సందర్భోచితంగా పదాలను జోడిస్తూ, ఆకట్టుకునేలా వ్యాఖ్యానించాలి. 'బరిలో మనమే ఉన్నామా..' అనే భావన కలిగించేలా గలగల మాట్లాడుతూనే ఉండాలి. నుత్తి లేకుండా సూటిగానూ చెప్పగలగాలి. అలాంటి కీలక విధులను నిర్వహిస్తున్నారు నస్పూర్ మండలకేంద్రానికి చెందిన యువకుడు రేగుళ్ల వెంకట్. - నస్పూర్

నస్పూర్ మండల కేంద్రంలోని రిటైర్డ్‌మెంట్ కాలనీకి చెందిన రేగళ్ల వెంకట్, జాతీయ స్థాయిలో క్రీడావ్యాఖ్యాతగా, యాంకర్‌గా, స్పోర్ట్స్ జర్నలిస్టుగా రాణిస్తున్నారు. స్టార్ స్పోర్ట్స్ ఛానల్ కబడ్డీ తదితర క్రీడల వ్యాఖ్యానాన్ని తెలుగులో ప్రసారం చేస్తుండగా, ఆ ఛానల్‌కు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే తెలుగు బృందానికి వెంకట్ నాయకత్వం వహిస్తున్నారు. సరదా సరదా వ్యాఖ్యానంతో, మధ్య మధ్యలో మిమిక్రీతో తనదైన శైలిలో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.

• ప్రోకబడ్డీలో యాంకర్స్ టీం లీడర్‌గా..

గతేడాది ముంబైలో స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ప్రోకబడ్డీ మ్యాచ్‌లకు యాంకర్స్ లీడర్‌గా, వ్యాఖ్యాతగా వెంకట్ తన ప్రతిభను చాటుకు

- **ప్రో కబడ్డీలో నస్పూర్ యువకుడి మాటల గారడీ**
- **యాంకర్‌గా, స్పోర్ట్స్ జర్నలిస్టుగా రాణింపు**
- **జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు**

న్నారు. మ్యాచ్‌ల కోసం నాలుగు నెలలు ముంబైలోనే మకాం వేశారు. మ్యాచ్‌లు జరిగేటప్పుడు ప్రతిరోజూ సుమారు 15 గంటల వరకు పనిచేశారు. రాష్ట్రంలోని పలు తెలుగు చానళ్లలో యాంకర్‌గా, స్పోర్ట్స్ రిపోర్టర్‌గా, సబ్‌ఎడిటర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉన్నది. ఆయా చానళ్లలో క్రీడలకు సంబంధించి అరుదైన కథనాలను తెరకెక్కించారు. ఈ క్రమంలో బెస్ట్ స్పోర్ట్స్ న్యూస్ షో, స్పోర్ట్స్ తెలుగు స్పెషల్ షో విభాగాల్లో రెండు అవార్డులను అందుకున్నారు.

• చిన్నతనం నుంచే మిమిక్రీ..

వెంకట్ తల్లిదండ్రులు కోటయ్య, వెంకటనర్సమ్మ. వీరికి ఈయన రెండో సంతానం. అన్న ఉపేందర్‌తో కలిసి చిన్నతనం నుంచే స్టేజీషోలలో మిమిక్రీ చేసేవారు. పాఠశాలలో ప్రార్థనకు ముందు వార్తలు చదివేవారు. మంచిర్యాలలో ఇంటర్, ఖమ్మంలో డిగ్రీ పూర్తిచేశారు. వెయింట్ లిఫ్టింగ్‌లో యూనివర్సిటీ స్థాయిలో, రాష్ట్ర స్థాయిల్లో అనేక బహుమతులను సాధించారు. అనంతరం జర్నలిజం కోర్సు పూర్తిచేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని సెయింట్ అగస్టిన్ కాలేజీలో ఎంబీఏ పూర్తి చేశారు.


అజేయ్ జడేజా చేతుల మీదుగా అవార్డును తీసుకుంటున్న వెంకట్

పరిస్థితులకు అనుగుణంగా..
- రేగళ్ల వెంకట్



మ్యాచ్ పరిస్థితులను పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని సమాయానికి అనుగుణంగా స్పందించాలి. క్రీడల్లో మేధావుల సలహాలు, సూచనలు తీసుకుంటూ నన్ను నేను మెరుగుపరుచుకుంటున్నా. స్పోర్ట్స్ యాంకర్‌గా, టీం లీడర్‌గా, వ్యాఖ్యాతగా రాణించడం వెనుక నా కుటుంబసభ్యులు ముఖ్యంగా నాన్న కోటయ్య, అన్న ఉపేందర్ ప్రోత్సాహం ఎంతగానో ఉన్నది. తెలుగు రాష్ట్రాల్లోని క్రీడల పరిస్థితిపై పీహెచ్‌డీ చేయాలని ఉన్నది. ప్రస్తుతం డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఆర్‌ఐసీఓ.సీకెహెచ్ఐఎల్.డాట్‌కాం పేరిట ఒక స్పోర్ట్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించాను.

బతుకు పంక్చర్

- **ఒకప్పుడు వాడవాడలా సైకిల్ షాపులు**
- **బైకుల రాకతో క్రమేణా కనుమరుగు**
- **వృత్తిని నమ్ముకొని ఉన్నవారికి ఉపాధి కరువు**


సైకిల్ షాపులో సైకిళ్లను రిపేర్ చేస్తున్న దృశ్యం

ఒకప్పుడు పట్టణాల్లో కాలేజీకి వెళ్లాలన్నా, ఉద్యోగానికి వెళ్లాలన్నా, మార్కెట్‌కు వెళ్లి సరుకులు తేవాలన్నా సైకిల్ కావాల్సిందే! పల్లెల్లో పొలానికి వెళ్లాలన్నా.. పక్క ఊరికి వెళ్లాలన్నా సైకిల్ లేనిది పని నడిచేది కాదు! నాడు సైకిల్, సామాన్యుని జీవితంలో భాగం. కానీ మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజల ఆర్థికస్థోమత కాస్త పెరగడంతో బైకులను కొనడం మొదలైంది. గడిచిన దశాబ్దకాలంలో బైకుల మోజు పల్లెలకూ పాకి, క్రమంగా సైకిల్ కనుమరుగైంది. ఫలితంగా ఒకప్పుడు వాడవాడలా సైకిల్ పంక్చర్లు చేస్తూ, వాటిని అద్దెకిస్తూ బతికిన ఎంతోమంది ఉపాధికి దూరమయ్యారు. చాలా మంది షాపులను మూసేసి ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్లితే కొందరు మాత్రం అరకొరగా ఉన్న సైకిళ్లనే నమ్ముకొని బతుకుబండి లాగుతున్నారు. - బెల్లంపల్లి టౌన్

• పట్టణాల్లో అద్దెకు..

పల్లెల నుంచి వివిధ పనులపై పట్టణాలకు వచ్చేవారి కోసం బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల ముందు అద్దె సైకిళ్లు అందుబాటులో ఉండేవి. మండలకేంద్రాలు, వివిధ గ్రామాల కూడళ్లలోనూ ఒకటి, రెండు అద్దెషాపులు దర్శనమిచ్చేవి. కావాల్సినవారు తీసుకెళ్లి పని పూర్తయ్యాక తెచ్చి ఇచ్చేవారు. ఇందుకు గంటకు 50 పైసలో, రూపాయో వసూలు చేసేవారు. రోజంతా కావాలంటే రూ.10 ఆలోపే అద్దెకిచ్చేవారు. పనిలోపనిగా సైకిల్ రిపేరింగ్ షాపు కూడా పక్కనే పెట్టుకొని పంక్చర్లు, ఇతర మరమ్మతులు చేస్తూ పొట్టపోసుకునేవారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వందలాది మంది ఉండేవారంటే అతిశయోక్తి కాదు. కానీ గడిచిన దశాబ్ద కాలంలో ఆటోల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. పట్టణాలు, పల్లెల్లో ఎటుచూసినా అవే దర్శనమిస్తున్నాయి. రూ.20 ఆపైన చేతిలో పెడితేచాలు, కోరుకున్న చోట దింపుతున్నాయి. సైకిల్ శ్రమపై ఆధారపడ్డ వాహనం కావడం, నేటితరం కష్టించేతత్వానికి దూరం కావడం, పైసలంటే లెక్కలేనితనంతో ఆటోలనే ఆశ్రయిస్తున్నది. ఫలితంగా ఒకప్పుడు వాడవాడలా దర్శనమిచ్చిన సైకిల్ అద్దె షాపులు నేడు జిల్లాలో పదికి మించి లేవు.

• సైకిళ్లు లేవు.. పంక్చర్లు లేవు..

ప్రజలు సైకిళ్లను విరివిగా వినియోగించిన కాలంలో పట్టణాల్లో మూలమూలలా, చిన్నచిన్నగ్రామాల్లోనూ పెద్దసంఖ్యల్లో సైకిల్ రిపేరింగ్ షాపులు ఉండేవి. పంక్చర్లు వేయడం, టైర్లు, ట్యూబులు, రిములు మార్చడం ఇతరత్రా ఎన్నో పనులు చేసేవారు. జిల్లావ్యాప్తంగా వీటిని నమ్ముకొని వేలాది మంది జీవించేవారు. కానీప్రస్తుతం పల్లెటూళ్లలోనూ బైకులే వాడుతుండడంతో సైకిళ్లు కనుమరుగై వీరి ఉపాధి దెబ్బతిన్నది. అరకొరగా ఉన్న సైకిళ్ల కోసం ఎక్కడో ఒకటి అరా సైకిల్ రిపేరింగ్ షాపులు గుడ్డిదీపాల్లా దర్శనమిస్తున్నాయి.

• సైకిల్ తొక్కడం నామోషీ కానే కాదు..

జిల్లాలో నేటితరం యువతీయువకులు సైకిల్ తొక్కడాన్ని నామోషీగా భావిస్తున్నారు. కానీ ఇది సరికాదు. తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాల్లో నేటికీ సైకిళ్లనే అధికంగా వినియోగిస్తున్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఒంటికి వ్యాయామంతో పాటు పెట్రోల్ ఖర్చులూ మిగులుతాయి. పర్యావరణానికి మేలు జరుగుతుంది. మనవల్ల పలువురికి ఉపాధి దొరుకుతుంది. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ఎంతో మంచిదని ఆరోగ్యనిపుణులు, పర్యావరణవేత్తలు చెబుతున్నారు.



సైకిల్ ఎందుకు తొక్కాలంటే..

- శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాయామం లభిస్తుంది. తద్వారా శరీరమంతటా రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.
- కండరాలు దృఢంగా తయారవుతాయి. కీళ్లు, మోకాళ్ల సమస్యలు దూరమవుతాయి.
- రోజూ గంటపాటు సైకిల్ తొక్కితే 400 నుంచి 450 కాలరీల కొవ్వు కరుగుతుంది. పొట్టను తగ్గించుకోవచ్చు. ఊబకాయం ముప్పును తప్పించుకోవచ్చు.
- సైకిల్ తొక్కడం వల్ల ఒంట్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ కరిగిపోయి, మధుమేహం సమస్యలు దరిచేరవు. ఒకవేళ చక్కర వ్యాధిఉన్నా అదుపులోకి వస్తుంది.
- ప్రతిరోజూ వచ్చిని చెట్లను చూస్తూ సైకిల్ తొక్కడం ద్వారా మానసిక ఒత్తిడి దూరమవుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మతిమరుపులాంటి సమస్యలు దరిచేరవు.
- పొట్టలోని కండరాలు కదలడం వల్ల జీవక్రియమెరుగుపడుతుంది.
- వారానికి 30 కిలోమీటర్ల వరకు సైక్లింగ్ చేసే రోగాలు 50 శాతం మేర తగ్గిపోతాయని పలు ప్రయోగాల్లో రుజువైంది.
- సైక్లింగ్ చేసేటప్పుడు శ్వాస తీసుకోవడం, వదలడం వల్ల శ్వాసప్రక్రియ మెరుగుపడుతుంది. తద్వారా ఊపిరితిత్తులు శుభ్ర పడుతాయి. గుండె పదిలంగా ఉంటుంది.

ప్రమాదాలకు అడ్డుకట్ట పడేనా?

▸▸ మరమ్మతులకు రూ.62కోట్ల మంజూరు ▸▸ త్వరలోనే పనులు ప్రారంభం ▸▸ ఫలించిన ఎంపీ నగేష్ కృషి



ఆదిలాబాద్ జిల్లా సమీపంలోని జాతీయ రహదారి ఇదే..

ఆదిలాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి ప్రమాదాలకు ఇక అడ్డుకట్ట పడనుంది. నిర్మల్ జిల్లా గోదావరి నది నుంచి ఆదిలాబాద్ జిల్లా పెన్‌గంగా నది వరకు విస్తరించి ఉన్న దాదాపు 120 కి.మీల మేర జాతీయ రహదారి మరమ్మతు పనులకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే అథారిటీ భారీగా మం జూరు చేసినట్లు ఎంపీ గోడం నగేష్ వివరించారు. నిర్మల్ జిల్లాలోని సోన్, కడ్తాల్ గ్రామాల వద్ద అండర్ బ్రిడ్జితో పాటు గుడిహత్నూర్, గాంధీనగర్ గ్రామాల వద్ద అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. అలాగే రహదారి వెంట దుమ్ముతో ఉన్న సర్వీసు రోడ్ల నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నారు. దీనికిగాను రూ.62కోట్ల 55 లక్షలను కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. అలాగే జందాపూర్, బట్టి సావర్గాం, బోరజ్ చెక్‌పోస్టు, మావల గ్రామ సమీపంలో జాతీయ రహదారి పనుల్లో నెలకొన్న సాంకేతిక లోపాలను సవరించనున్నారు. రహదారి పొడవున ప్రయాణికులకు సౌకర్య వం తమైన బస్‌షెల్టర్‌లను నిర్మించి సెంట్రల్ లైటింగ్ పనులు చెపట్టానున్నారు. త్వరలోనే టెండర్లను పిలిచి పనులను ప్రారంభిస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డకట్ట పడే అవకాశం ఉందంటున్నారు. ఎంపీ గోడం నగేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

లక్ష్మణచాంద, జనవరి 5 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను శుక్రవారం పోలీసుల పట్టుకున్నారు. చింతల్‌చాంద గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు చామన్‌పల్లి గ్రామం వద్ద ట్రాక్టర్‌ను, డ్రైవర్‌లను ఆదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు అప్పగించారు. ఇందులో ఏఎస్సై సాజిద్, హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది ఆందోళన

ఖానాపూర్ , జనవరి 5 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ చెందిన వార్డు సభ్యురాలు భర్త తనను అసభ్యకరమైన పదజాలంలో దూషించాడని ఆరోపిస్తూ శుక్రవారం ఖానాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పిలువురు సిబ్బంది ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. గురువారం సాయంత్రం పింఛన్‌లు పంపిణీ చేసే సమయంలో అక్కడికి వచ్చిన ఖానాపూర్ శ్రీరాంనగర్‌కు చెందిన గాదేపు చందు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌తో పాటు అక్కడ ఉన్న సిబ్బందిని దూషించాడని శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి విధులు బహిష్కరించి ఆందోళన చేశారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది ఆందోళన చేయడంతో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ సక్కారాం శ్రీనివాస్, సర్పంచ్ సత్యనారాయణ, ఈవోపిఆర్డీ చిక్యాల రత్నాకర్‌రావు, పలువురు నాయకులు వచ్చి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. గాదెపు చందు పంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శికి క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



వివరాలను తెలుసుకుంటున్న ఎస్సై

11ఇసుక ట్రాక్టర్ల సీజ్

బేల, జనవరి 5: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని కాన్‌గార్‌పూర్ సరిహద్దు ప్రాంతమైన పెన్‌గంగా నుంచి అక్రమంగా తర లిస్తున్న ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం తహసీల్దార్ ఠాకూర్ నంద కిషోర్‌సింగ్ గూడ, మనియార్‌పూర్ శివారు ప్రాంతంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల జరిమానా విధించారు. రెవెన్యూ అనుమతులు లేనిది అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

క్రైం వార్తలు

8వ తేదీ వరకు 144 సెక్షన్ పొడగింపు

ఉట్నూర్, జనవరి 5 : లంబాడా, ఆదివాసీల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో అమలు చేస్తున్న 144 సెక్షన్ నిషేధాజ్ఞలను మరో మూడు రోజుల పాటు సోమవారం వరకు పొడగించడం జరిగిందని ఉట్నూర్ డీఎస్పీ వెంకటేష్, తెలిపారు. ప్రస్తుతం ఏజెన్సీలో ఉద్రిక్తత పరిస్థితులు అదుపులోకి వచ్చినప్పటికీ ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని డీఎస్పీ హెచ్చరిచారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్‌రూరల్, జనవరి 5 : ఖానాపూర్‌లో 144 సెక్షన్‌ను 7వ తేదీ వరకు పొడగించినట్లు ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కడ కూడా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని, ఉల్లంగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

మామడ : నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో శుక్రవారం ఉదయం గొనుగొప్పుల లక్ష్మీ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లక్ష్మీభర్త గత కొన్ని సంవత్సరాల క్రితం అప్పులు చేసి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకకపోవడంతో చేసిన అప్పులు వడ్డీతో భారీగా పెరిగిపోయాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సయ్య తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్

నిర్మల్‌టౌన్ , జనవరి 05 : నిర్మల్ పట్టణంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన సంక్షేమ హాస్టల్ వార్డెన్ కవితను నిర్మల్ జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు సస్పెండ్ చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి జనార్ధన్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఈద్‌గాం సంక్షేమ హస్టల్‌లో ఆకస్మికంగా తనిఖీ చేయడంతో స్థానికంగా వార్డెన్ ఉండడం లేదని హస్టల్ విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులను జిల్లా అధికారికి పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి: ఇద్దరికి గాయాలు

కుభీర్, జనవరి 5 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పల్సి - రంజని రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరూ అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్సి గ్రామానికి చెందిన సీడెవార్ దేవన్న(60) అనే వ్యక్తి రంజిని తాండా గ్రామ సమీపంలోని దేవుని పండగకు బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సీడేవార్ దేవన్న అక్కడిక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

భైంసా

హస్లూల్‌లో అభివృద్ధి ప్రణాళికలు

భైంసారూరల్, జనవరి 5: మండలంలోని హస్లూల్ గ్రామ పంచాయతీ భవనంలో అభివృద్ధి పనుల ప్రణాళికలను గ్రామ సభలో రూపొందించారు. ఆరుమాసాలకోసారి నిర్వహించే గ్రామ సభను శుక్రవారం సర్పంచు రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కోసం ఇదివరకు రూపొందించిన ప్రణాళికలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు.



హస్లూల్‌లో గ్రామసభ దృశ్యం

సంక్షిప్తంగా..



పార్టీలో చేరిన యువకులతో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి

బీజేపీలో యువకుల చేరిక

భైంసా, జనవరి 5: పట్టణ పరిధిలోని పలు వార్డులకు చెందిన యువకులు శుక్రవారం బీజేపీ పార్టీలో చేరారు. స్థానిక పులేనగర్ కాలనీ పరిధిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారందరూ బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గాలి రవి నేతృత్వంలో జిల్లా అధ్యక్షురాలు పి.రమాదేవి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీలో చేరిన వారిలో భైంసాకు చెందిన తెలంగాణ జాగృతి మెడ్వల్ కో కన్వీనర్ అరెపెల్లి సతీష్ కుమార్, స్థానిక ఇండియన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు హరీష్ తదితరుల ఆధ్వర్యంలో వారి అనుచరులు, వివిధ సంఘాల సభ్యులు, యువకులు ఉన్నారు. పార్టీ అధ్యక్షురాలు పి.రమాదేవి వారందరికి బీజేపీ కండువా వేసి ఆహ్వానం పలికారు. ఇందులో పార్టీ ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ రాజన్న, స్వచ్ఛ భారత్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ సూత్రావే, బీజేవైఎం పట్టణ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి'

భైంసారూరల్, జనవరి 5: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఉపాధ్యాయ సంఘ నేతలతో అన్నారు. శుక్రవారం దేగాంలో తన నివాసంలో టీయూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషన్, ఆయా మండలాల నాయకులు సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, గణపతి, గంగాధర్, బోస్లే గంగాధర్, గోపాల్‌రెడ్డి శంకర్, ఇంద్రసేనారెడ్డి, నితిన్, తదితరులున్నారు.

స్వచ్ఛ శబరిమలకు అంకితమవుతాం : స్వాములు

భైంసా, జనవరి 5: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు బాధ్యతాయుత విధానాలతో అంకితమవుతామని డివిజన్ కేంద్రంలోని అనసూయపవార్‌నగర్ కాలనీకు చెందిన అయ్యప్ప స్వామి దీక్షదారులు, భక్తులు శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. కాలుష్యరహిత శబరిమల కోసం 'పీఏఎస్ -ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో చేపట్టిన మహోత్తర కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. ఇక నుంచి ప్లాస్టిక్ వాడబోమని, స్వచ్ఛ శబరిమలకు చిత్తశుద్ధితో అంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అయ్యప్పలు

వరి గడ్డి బంగారమాయే!

▸▸ రైతన్నకు భారమవుతున్న పశు పోషణ

కుంటాల, జనవరి 5: ప్రస్తుత పరిస్థితుల్లో పశుగ్రాసం కొరతతో రైతన్నకు పశుపోషణ భారంగా మారింది. గతంలో వ్యవసాయ భూముల్లో రైతులు గడ్డిని కోసి ఆరబెట్టి కుప్పలుగా చేసి ఆ గడ్డిని రబీలో వర్షాకాలం వరకు వాడేవారు. ప్రస్తుతం బీడుభూములన్ని వ్యవసాయానికి సాగు చేయడంతో ఆ గడ్డి(కొతగడ్డి) కనబడుట లేదు. ప్రస్తుతం ఉన్నటువంటి ఒకే ఒకటి వరి గడ్డి ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు వరి నాటే సమయంలో ముఖం చాటేయడంతో చాలామందిరైతులు నాట్లు వేయలేదు. దీంతో వరిగడ్డి అంతంత మాత్రమే ఉండడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రతీఒక్కరు పశువులకు మేతగా వచ్చే జూన్‌వరకు దీన్ని ఉపయోగిస్తారు. దీంతో వరి గడ్డికి గిరాకి పెరిగింది. ట్రాక్టరు వరి గడ్డి దాదాపు రూ.5 వేల వరకు కొనుగోలు చేయగా దాన్ని ఇంటికి తీసుకొచ్చేందుకు కూలీలు, ట్రాక్టర్‌తో మరో రూ.2 వేలకు వరకు అదనంగా ఖర్చవుతుంది. దీంతో ఏమి చేయలేని పరిస్థితిలో పశుపోషకులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ప్రభుత్వం డిసెంబర్ మాసం నుంచి రైతులు సబ్సిడిపై గడ్డి విత్తనాలు అందజేసేది ప్రస్తుతం గడ్డి విత్తనాలు సబ్సిడిపై సరఫరా చేయకపోవడంతో సమాన్య రైతులు వీటికి కొనలేని పరిస్థితిలో ఉన్నారు.



ట్రాక్టర్‌లో వరి గడ్డిని తీసుకెళ్తున్న దృశ్యం

గత నెల రోజులుగా వర్షాలు తగ్గిపోయి. ఎండలు మండుతుండడంతో పశుగ్రాసం ఎండదశకు చేరుకుంది. ప్రస్తుతం వరి గడ్డిపైనే ఆధారపడి పశువులు పోషించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వరి గడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది.

• సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేయాలి
- ముత్యం, కల్లూర్

ప్రభుత్వం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో సబ్సిడిపై గడ్డి విత్తనాలను సరఫరా చేయాలి ప్రస్తుతం పచ్చి గడ్డి కొరతతో కావలంటే సబ్సిడీ గడ్డి విత్తనాలు సరఫరా చేస్తే రైతులు పత్తి గడ్డి తయారు చేసుకుంటారు.

• పశుపోషణ భారంగా మారింది
- కిరణ్, తురాటి



ప్రస్తుతం పరిస్థితిలో పశుగ్రాసం కొరత మూలంగా పశుపోషణ భారంగా మారింది. బోరుబావులున్న రైతులకు కొంత మేర పశుగ్రాసం లభిస్తుంది. బోరుబావులు లేని వారికి పశుగ్రాసం కొరత మూలంగా పశులను పోషించలేని పరిస్థితి నెలకొంది.

అన్నదాతల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

భైంసా, జనవరి 5: అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించి వారి అభివృద్ధియే ధ్యేయంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తానూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మట్లాడారు. గత ప్రభుత్వాలు అన్నదాతల అభివృద్ధిని హామీలకే పరిమితం చేయగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ సర్కారు క్షేత్రస్థాయిలో అమలు పరుస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న విద్యుత్ సమస్యలన్నింటినీ అధిగమించి నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తద్వారా దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సరఫరా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమైందన్నారు. అన్నదాతలు సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకుని ప్రగతి బాటలో పయనించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మహాలింగి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో షాదీముబారక్, కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఎంపీపీ బాలేరావ్ లాలూ, జడ్పీటీసీ పోతారెడ్డీరావ్ పటేల్, సర్పంచ్ మాధవ్‌రావ్, పటేల్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణరావ్ పటేల్ డీసీసీబీ డైరెక్టర్ ఇంద్రకరణ్ రెడ్డి, ఆయా మండలాల చైర్మన్లు సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, చిన్నారావ్, లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు బాశెట్టి రాజన్న, ఉత్తం, బాలేరావ్, షైసేకర్ సాయిలు, తహసీల్దార్ రాములు, ఎంపీడీవో నాగనాథ్, నాయకులు భోజన్న, పుండ్లీక్, గంగాధర్ రమేష్‌పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావ్ పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

భీమా కోరేగావ్ ఘటనపై దళితుల ఆందోళన

కుభీర్, జనవరి 5: మండలంలోని పార్డీ(బి) గ్రామంలో శుక్రవారం భీమా కోరేగావ్ ఘటనలో దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కోరేగావ్ ఘటన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతకు ముందు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. మహారాష్ట్ర ప్రభుత్వం పుణేలో జరిగిన ఘటనలో దుండగులను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్డీ(బి)-భైంసా రహదారిపై 30 నిమిషాల పాటు రాస్తారోకో నిర్వహించగా కుభీర్ పోలీసులు సముదాయించడంతో ఆందోళన విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, గౌతమ్, మిలింద్, సాయినాథ్, భీం సేనా యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



భైంసా-నిర్మల్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల సభ్యులు

కుంటాల, జనవరి 5: మహారాష్ట్ర పుణే భీమా కోరేగావ్ ఘటనకు బాధ్యులైన దోషులను వెంటనే శిక్షించాలని శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామంలో భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.దిగంబర్ మాట్లాడుతూ బాధ్యులను వెంటనే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు. కాగా, రాస్తారోకో చేపట్టిన దళిత సంఘాల సభ్యులను భైంసావర్ చేసి తహసీల్దార్ ముందు హాజరుపరిచినట్లు ఎస్సై యూనుస్ అహ్మద్ అలి, సీఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్-2018 తనిఖీలు

భైంసా, జనవరి 5: పట్టణ పరిధిలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్-2018 పరిశీలన బృందం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించింది. గురువారం దినమంతా మున్సిపల్ కార్యాలయంలో అధికారులు అందజేసిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన బృందం శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు నిర్వహించి 43 అంశాలపై పరిశీలనలు, తనిఖీలు జరిపారు. రికార్డుల్లో పొందుపరచిన అంశాల ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలన బృందం ప్రతినిధి ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో సభ్యులు పరిశీలనలు చేపట్టారు. పలు వార్డుల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ, బహిరంగ మల మూత్ర విసర్జన రహిత విషయం, మరుగుదొడ్ల వినియోగం, మురికి వాడలు, రహదారుల పరిశుభ్రత, తడి, పొడి చెత్తను వేరుచేయడం, ఆసుపత్రులు, బస్టాండ్, హోటళ్ల చేపడుతున్న పారిశుద్య నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల వాసులతో మాట్లాడి రికార్డుల్లోని అంశాల ఆధారంగా వివరాలను సేకరించారు. ప్రధాన కూడళ్లలో నిర్మించిన శౌచలయాలను పరిశీలించి వాటి నిర్వాహణ తీరును పర్యవేక్షించారు. శనివారం సైతం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలనలు కొనసాగనున్నాయని తెలిసింది.

దళిత బస్తీ భూముల పరిశీలన

ముథోల్, జనవరి 5: మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, పిప్రి గ్రామ శివారులో శుక్రవారం భైంసా ఆర్డీవో రాజు ముథోల్ ఇన్‌చార్జీ తహసీల్దార్ లోకేశ్వరరావ్ దళిత బస్తీ కోసం భూములను పరిశీలించారు. దళిత బస్తీకి ఇచ్చే రైతులకు మార్కెట్ రేట్ ప్రకారం త్వరలో రేట్ ప్రకటిస్తామన్నారు. ముథోల్ 21 ఎకరాలు, వెంకటాపూర్‌లో 9 ఎకరాలు, పిప్రిలో 9 ఎకరాల భూమి దళిత బస్తీ కోసం పరిశీలించారు. అలాగే గతంలో దళితబస్తీ కింద అందజేసిన భూములను కూడా వెంకటాపూర్‌లో ఆర్డీవో పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ లోకేశ్వరరావ్, ఆర్ఐ సత్యనారాయణ, కన్వీనర్ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్‌లున్నారు.

రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కుభీర్, జనవరి 5: మండలంలోని పల్సి గ్రామానికి చెందిన సీహెచ్ సాయినాథ్ అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి రూ. 60 వేల చెక్కును అందజేశారు. ఇందులో తూం రాజేశ్వర్, శేరి సురేష్, బాబు, అనిల్‌లున్నారు.

లోకేశ్వరం ఎస్సైగా భరత్‌సుమాన్

లోకేశ్వరం, జనవరి 5: లోకేశ్వరం ఎస్సైగా భరత్‌సుమన్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎస్సైని సన్మానించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

ఇంటర్వ్యూ

భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో భూ ప్రక్షాళన



అజీజ్‌ఖాన్, డిప్యూటీ తహసీల్దార్

ఆంధ్రజ్యోతి: భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి కృషి చేస్తున్నారు?

అధికారి: రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసమే భూ ప్రక్షాళన కార్యక్రమం చేపట్టింది. ఇందులో రైతుల భూములకు సంబంధించిన లోటుపాట్లను సరిదిద్దుతూ ప్రస్తుతం రైతుఖాతాకు ఆధార్‌తో పాటు బ్యాంకు అకౌంటును అనుసంధానం చేస్తూ ఆన్‌లైన్‌లో క్రోడీకరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: చౌక దుకాణాల ద్వారా సరుకులు సక్రమంగా అందజేస్తున్నా?

అధికారి: మండలంలోని 11 రేషన్ దుకాణాలు ప్రతినెలా డీలర్లచే సకాలంలో డీడీలు చెల్లించేలా చర్యలు తీసుకుంటూ వినియోగదారులకు నిర్ణీత గడువులోగా సరుకులు అందేలా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: భూ ప్రక్షాళనలో ఎలాంటి భూములను గుర్తించారు?

అధికారి: భూప్రక్షాళన కార్యక్రమంలో రైతుకు సంబంధించిన భూమితో పాటు అటవీ భూమి, సాగుకు పనికిరాని భూమి, వక్ఫ్ బోర్డు భూములను గుర్తించాం.

- కుంటాల

నిర్మల్

నిర్మల్ - నిర్మల్ అర్బన్ - నిర్మల్ రూరల్ - దిలావర్‌పూర్
సోన్ - సారంగాపూర్ - నర్సాపూర్ (జి)

'ఆశా కార్యకర్తలకు పారితోషకాలను వెంటనే విడుదల చేయాలి'

నిర్మల్‌టౌన్ , జనవరి 5 : వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న ఆశ కార్యకర్తలకు పారితోషికాలతో పాటు గౌరవ వేతనాన్ని వెంటనే ఇవ్వాలని ఆశ కార్యకర్తల జిల్లా కమిటీ సమావేశంలో తీర్మాణం చేసింది. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా కార్యకర్తల సమావేశంలో జిల్లా కార్యదర్శి దాదేమియా ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశా కార్యకర్తల పారితోషికంతో పాటు 6వేల వేతనం ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆశా కార్యకర్తలు ఇందిరమల, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వార్తలు

పింఛన్‌ల కోసం
పడిగాపులు



బారులు తీరిన లబ్ధిదారులు

దిలావర్‌పూర్, జనవరి 5 : పింఛన్ పంపిణీలో జాప్యం లబ్ధిదారులకు ఇబ్బంది గా మారుతోంది. నెల నెల ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులు రెండు నెలలు ఆలస్యం కావడంతో పింఛన్ కోసం పోస్టాఫీసు వద్ద మహిళలు, వృద్ధులు, బారులు తీరుతున్నారు. గంటల కొద్ది క్యూలో నిలబడి ఇబ్బంది పడ్డారు. దిలావర్‌పూర్ పోస్టాఫీసు వద్ద గత ఐదు రోజులుగా పింఛన్‌దారులు బారులు తీరి పింఛన్‌లు పొందుతున్నారు. అధికారులు పింఛన్ డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే బాగుంటుందని పలువురు పింఛన్ లబ్ధిదారులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న
ధఫ్ని సినిమా చిత్రీకరణ



పిల్లలతో కలిసి చలిమంటలు కాగుతున్న నటీ నటులు

దిలావర్‌పూర్, జనవరి 5: మండలంలో ధఫ్ని సినిమా చిత్రీకరణ కొనసాగుతుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హీరో, హీరోయిన్‌తో పాటు జూనియర్ ఆర్టిస్టులపై సన్నివేశాలు చిత్రీకరించారు. దిలావర్‌పూర్ పరిసరాల్లోని పచ్చని పంట పొలాల్లో హీరో, హీరోయిన్‌లపై పాటను చిత్రీకరించారు. పక్కా పల్లెటూరు నేపథ్యంగా తెలంగాణ యాస, భాషతో కూడిన ప్రేమకథా చిత్రంగ ధఫ్ని రూపు దిద్దుకుంటుందన్నారు. కో డైరెక్టర్ రాజ్ మోహన్, చిత్ర యూనిట్ సభ్యులు రాజు, ప్రదీప్, వినయ్ తదితరులున్నారు.

పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

నిర్మల్‌కల్చరల్, జనవరి 5 : నిర్మల్ పీజీ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత బదిలీ అయ్యారు. ఆమె కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు బదిలీ కావడంతో ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీ అయ్యింది.

ఆయుధ ధర్మ
దీక్షకు తపస్ మద్దతు

నిర్మల్‌కల్చరల్, జనవరి 5 : ఈ నెల 7న గజ్వేల్‌లో జరిగే ఆయుధ ధర్మదీక్షకు తపస్ మద్దతు ప్రకటించింది. జిల్లా అధ్యక్షుడు శశిరాజ్ విడుదల చేసిన ప్రకటనలో సీపీఎస్ రద్దయ్యే వరకు తమ సంఘం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సుదర్శన్, దత్తురాం, అరుణ్‌రాజ్‌లు మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.

ఊగిసలాటలో ఉన్నత విద్య



నిర్మల్ జిల్లా కేంద్రంలోని పీజీ కళాశాల

నిర్మల్‌కల్చరల్, జనవరి 5 : నిర్మల్ జిల్లాలో ఉన్నత విద్య ఊగిసలాడుతోంది. చదువుల తల్లి కొలువైన నిర్మల్ జిల్లాలో కేజీ నుంచి పీజీ వరకు విద్య అందుబాటులో ఉండాలని కోరుకుంటున్న విద్యార్థులకు ప్రస్తుతం యూనివర్సిటీపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, విద్య వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నప్పటికీ డిగ్రీ, పీజీ కళాశాలలు ఆశించిన త ప్రయోజనాలు నేరవేర్చలేదన్న అభిప్రాయాలున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రం లో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పీజీ విద్య అందుబాటులో ఉంది. ఒక మహిళ డిగ్రీ కళాశాల కొనసాగుతోంది. పీజీ విద్య కూడా అందుబాటులో ఉండగా విద్యార్థులు ఇటీవల కాలంలో నిర్మల్ పీజీ కళాశాలను కౌన్సిలింగ్‌లో ఎంచుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోయింది. పీజీ సెంటర్‌లో ఇతర జిల్లాల వారు ప్రవేశం కోరుకున్నప్పటికీ దూర భారంతో ఇతరకళాశాలలకు ప్రవేశంపై వెళుతున్నారు. దీంతో ఇక్కడ ఉన్న కోర్సులను యూనివర్సిటీ తరలిస్తోంది. ప్రిన్సిపాల్‌తో సహ మొత్తం పది మంది వరకు లెక్చరర్లు, పార్ట్ టైమర్లు పని చేస్తున్న గాని రెండో సంవత్సరం వరకు విద్యార్థులు నిలువడం లేదు. నిర్మల్ జిల్లాలోని పీజీ, డిగ్రీ కోర్సులు కాకతీయ యూ నివర్సిటీ పరిధిలో కొనసాగుతున్నాయి. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి నిర్మల్ జిల్లాను చేర్చి స్థానిక డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ కోర్సుల్లో మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తే తప్ప నిర్మల్ జిల్లా విద్యార్థులకు ఉప యోగవడదు. గతంలో యూని వర్సిటీ పరిధి మార్పి జిల్లాలోని విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చూడాలని గృహనిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ సాయన్నను కోరారు. ఈ మేరకు ఆయన హమీ ఇచ్చారు. కాని ఇప్పటి వరకు యూనివర్సిటీ పరిధి మార్పుపై ఎలాంటి పురోగాభివృద్ధి జరగలేదు. రాబోయే విద్యా సంవత్సరంలోనైనా డిగ్రీ, పీజీ కళాశాలలో సక్రమంగా విద్యార్థులకు అవకాశాలు పొందా లంటే యూనివర్సిటీ తెలంగాణ యూ నివర్సిటీ పరిధిలోకి తేవాలంటున్నారు.

పరిధి మార్పుపై దృష్టి సారించాలి..



నిర్మల్ జిల్లా ప్రజలకు కేజీ నుంచి పీజీ విద్య అందుబాటులో ఉండాలంటే కళాశాల స్థాయి విద్య తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి మార్చాలి. తద్వారా విద్యార్థులకు యూనివర్సిటీ దూరం భారం తగ్గడంతో పాటు స్థానికులు ఎక్కువ సంఖ్యలో కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతారు. మార్పు ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు.

- శివ ప్రసాద్ , డిగ్రీ ప్రిన్సిపాల్

ఇంటర్వ్యూ

మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి



ఉత్తం జాడే
విద్యుత్ శాఖ ఎస్‌ఈ

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఎన్ని ఉన్నాయి.?

అధికారి: జిల్లాలో మొత్తం 52వేలకు పైగా కనెక్షన్‌లున్నాయి.

ఆంధ్రజ్యోతి: రైతులకు 24గంటల నిరంతర విద్యుత్ సరఫరాలో ఏమైనా లోపాలున్నాయా?

అధికారి: ప్రస్తుతం సరఫరాలో ఎలాంటి లోపాలు రావడం లేదు.

ఆంధ్రజ్యోతి: ఆటో స్టార్టర్ల తొలగింపుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఆటో స్టార్టర్లు తొలగించకుంటే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆటో స్టార్టర్లను తొలగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : విద్యుత్ శాఖలో ఖాళీల కొరతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: వివిధ స్థాయిలో 257 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొరత ఉన్న మెరుగైన సేవలు అందిస్తున్నాం.

- నిర్మల్ అగ్రికల్చర్

నిత్యావసర సరుకులను సద్వినియోగం చేసుకోవాలి

» చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



బియ్యాన్ని తూకం చేస్తున్న చైర్మన్

నిర్మల్‌టౌన్, జనవరి 5 : పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని సోఫీనగర్ కాలనీలో స్థానిక కౌన్సిలర్ హసీనాబేగం ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపు సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. గతంలో స్థానికంగా రేషన్ షాపు లేకపోవడంతో ఈదిగాం రేషన్ షాపు ద్వారా ప్రజలు సరుకులను తీసుకోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడేవన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తేవడంతో జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చి నూతన రేషన్ షాపును సోఫీనగర్‌లో ఏర్పాటు చేశారన్నారు. స్థానిక కౌన్సిలర్ మహ్మద్ ఉస్మాన్, తహసీల్దార్ శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అజీంబిన్ యాహియా తదితరులున్నారు.

పోరు గర్జనను విజయవంతం చేయండి

ఖానాపూర్ , జనవరి 5 : ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించనున్న చాకలి పోరు గర్జనను విజయవంతం చేయాలని రజక సంఘం మండలాధ్యక్షులు సట్ల శంకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో రజక సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, శేఖర్, నరేష్, నర్సయ్య, రమేష్, శ్రీనివాస్, తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ కృషితోనే 24గంటల విద్యుత్ సరఫరా

» బీజేపీ గోదావరి కృష్ణ జలాల కమిటీ కన్వీనర్ రావుల రాంనాథ్

సోన్, జనవరి 5 : కేంద్ర ప్రభుత్వ కృషితోనే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల పాటు విద్యుత్‌ను అందిస్తుందని బీజేపీ గోదావరి కృష్ణ జలాల కమిటీ కన్వీనర్ రావుల రాంనాథ్ అన్నారు. శుక్రవారం సోన్ మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోడీ కృషితో 2022 నాటికి దేశంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. దేశంలో విద్యుత్ సరఫరా చేసే ఉదయ్ పథకంలోకి తెలంగాణ ప్రభుత్వాన్ని చేర్చడం జరిగిందన్నారు. దక్షిణాది, ఉత్తరాది పవర్ గ్రిడ్‌ను అనుసంధానం చేయడం వల్ల నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఇంత చేస్తున్న కేసీఆర్ నరేంద్రమోడీ పేరును ఎక్కడ కూడా ప్రస్తావించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతి పథకానికి పేరు మార్చి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు కొరిపల్లి శ్రావణ్ రెడ్డిలున్నారు.

నిర్మల్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా



డిపో ముందు నినాదాలు చేస్తున్న కార్మికులు

నిర్మల్ అగ్రికల్చర్: జనవరి 5: పార్లమెంట్‌లోని రాజ్య సభలో ప్రవేశపెట్టిన 2017 మోటార్ వెహికిల్ చట్టం ప్రవేశ పెట్టటకు నిరసనగా నిర్మల్ బస్ డిపో ఆవరణలో శుక్రవారం ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో సెక్రెటరీ గంగాధర్, ఎంప్లాయిస్ కార్యదర్శి రాజేశ్వర్‌లు మాట్లాడుతూ బిల్లు వల్ల ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతుందని రూట్ల పర్మిషన్ కోసం కేంద్రానికి పన్ను చెల్లించాల్సి వస్తుందని అన్నారు. 1-4-2017 నుంచి చేపట్టాల్సిన వేతన సవరణపై యాజమాన్య మొండి వైఖరి అవలంబిస్తుందని వేతన సవరణ చట్టం చేపట్టకుంటే సమ్మె తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ స్వామి, రమేష్, చిన్నయ్య, శంకర్, శేఖర్, లింగన్న, అంజయ్య తదితరులున్నారు.

ఆదివాసీ పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

నర్సాపూర్ (జి) , జనవరి 5 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ గిరిజనులమని చెప్పుకుంటూ ఎస్టీ తెగలలో చేరిన లంబాడీ కులస్థులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయక్ పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మొనలి చిన్నయ్య, ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి మంద మల్లేష్, రాజన్న, శంకర్, గణేష్, ఎర్రన్న తదితరులున్నారు.

సంక్షిప్తంగా..



భైంసా బస్ డీపో ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న టీఎంయూ, ఈయూ యూనియన్ల శ్రేణులు

డీపో ఎదుట ఆర్టీసీ కార్మిక సంఘాల ఆందోళన

» డీపో ఎదుట బైఠాయించి నిరసన ప్రదర్శనలు

భైంసా, జనవరి 5: కేంద్ర ప్రభుత్వం మోటారు వాహన చట్టం సవరణ బిల్లు-2017ను నిరసిస్తూ ఆర్టీసి కార్మిక సంఘాలు శుక్రవారం భైంసాలో ఆందోళనలను చేపట్టాయి. మధ్యాహ్నం వేళలో తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ శ్రేణులు సంయుక్తంగా డిపో ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రవేశ మార్గంలో బైఠాయించి బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎంయూ, ఈయూ కార్మిక సంఘాల ప్రతనిధులు భూమన్న, శ్యాంరావ్, ఎంఏ హాదీ, గంగయ్య, ప్రేమ్ స్వరూప్‌లు మాట్లాడుతూ కేంద్ర సర్కారు తీసుకొస్తున్న కొత్త రవాణా చట్టం ప్రజా రవాణా వ్యవస్థ ల ను నిర్వీర్యం చేసేలా ఉందని ఆరోపించారు. సవరణ బిల్లు ఆమోదం పొందితే రాష్ట్ర ఆదాయానికి గండి పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో ప్రైవేటు ఆపరేటర్లను పెంచి పోషించే విధానాలు అమలులోకి వస్తాయన్నారు. ఇకనైనా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని కార్మిక నాయకులు వెల్లడించారు.

పార్టీ పటిష్టతకు కృషి

» బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి

నిర్మల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీని పటిష్ట పరిచి రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారం కైవసం చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తామని నూతనంగా నియమితులైన పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ మ ల్లికార్జున్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఆయనను ఘ నంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంస్కరణలు ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు సాహసోపేత నిర్ణయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారం కోసం కిందిస్థాయి నుంచి పార్టీ శ్రేణులు సమాయత్త పరుస్తామన్నారు. పార్టీలో అన్ని వర్గాల వారికి ప్రాదాన్యతనిచ్చి పార్టీ శ్రేయస్సుకు పాటు పడతానన్నారు. తనకిచ్చిన పదవికి న్యాయం చేసి అధిష్టానం ఆదేశం మేరకు అంకిత భావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎంపికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ముగ్గుల పోటీలకు ముస్తాబైన హరిహరక్షేత్రం

» జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న మహిళలు » హాజరుకానున్న ప్రముఖులు

నిర్మల్ కల్చరల్, జనవరి 5: నిర్మల్ పట్టణం మల్లన్న గుట్ట వద్ద గల హరిహరక్షేత్రంలో శనివారం 'ఏబీఎన్-ఆంధ్ర జ్యోతి' ఆధ్వర్యంలో మహిళలకు చుక్కలతో ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు ముస్తాబైంది. ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ, మురళీధర్ రెడ్డిల ఆధ్వర్యంలో గురుస్వాములు చెనిగారపు చిన్నయ్య, వేణుగోపాల్ రెడ్డి తదితర స్వాములు ఆలయ ప్రాంగణంలో మహిళలు పాల్గొనే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. గత నాలుగు రోజుల నుంచి హరిహరక్షేత్రం అయ్యప్ప ఆలయం ఎదుట వేదిక ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి.

● **హరిహర క్షేత్రంలో పోటీలు**

నిర్మల్‌లోని హరిహరక్షేత్రంలో నిర్వహించే పోటీలకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు హజరు కానున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు ఆయా గ్రామాల నుంచి సమాచారం తెలుసుకొని పోటీల్లో పాల్గొనేందుకు సుమారు 200మంది మహిళలు పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వహకులు అంచనా వేస్తున్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలకు ఈ పాటికే నియమ నిబంధనలు వివరించడమైంది.

● **హాజరుకానున్న కలెక్టర్**

శనివారం నిర్వహించబోయే ముగ్గుల పోటీలకు ప్రముఖ వ్యాపార వేత్త మురళీధర్ రెడ్డి, ఆయన సతీమణి వినోదమ్మతో పాటు జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జేసీ సీహెచ్.శివలింగయ్య, ఆర్డీవో ప్రసునాంబతో పాటు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలకు నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. ముగ్గుల పోటీలను తిలకించేందుకు పట్టణ ప్రజలు కూడా రానున్నారు.



నిర్మల్ పట్టణంలోని ముగ్గుల పోటీలు నిర్వహించే స్థలం ఇదే..

అన్నదాతకు టమాట పోటు

» రూ.2లకు పడిపోయిన కిలో టమాట ధర

» దక్కని లాభం.. ఆశలు ఆవిరి

» విస్తీర్ణం పెరిగినా.. ప్రయోజనం శూన్యం

భైంసా, జనవరి 5: పుడమి తల్లిని నమ్ముకున్న రైతన్నకు గత కొంతకాలంగా ఏ కాలమూ కలిసి రావడం లేదు. మూడున్నర సంవత్సరాలుగా ప్రతికూల పరిస్థితులతో పంటలు పండక రైతులు కుదేలయ్యారు. సంప్రదాయ పంటలు వేస్తే ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరించడంతో రైతన్నలు ఈ సారి వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపారు. నాలుగు రూపాయలు కళ్ల చూద్దామనుకుని టమాట, ఇతర కూరగాయల సాగువైపు దృష్టి కేంద్రీకరించారు. ప్రత్యేకించి టమాటా తక్కువ కాలంలో పండి అధిక దిగుబడులు ఇస్తుంది. తద్వారా లాభాలను పొందవచ్చనుకున్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో ఎక్కువ మంది రైతులు టమాట పంటనే అధికంగా సాగు చేశారు. కానీ అన్నదాతలకు ఈసారి ధరల రూపంలో కాటు పడింది. పడిపోయిన ధరలతో పంటను ఏం చేయాలో అర్థంకాక జిల్లాలోని టమాట రైతులు కుంగిపోతున్నారు. వీరి వేతలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● **వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాలన్న అధికారులు**

వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారులు, నిపుణులు జిల్లా రైతులకు పదేపదే చెప్పడంతో చాలా మంది రైతులు ఇతర పంటల గురించి ఆలోచించారు. అంతో ఇంతో అనుభవం ఉన్న కూరగాయల పంటలపై అధికంగా దృష్టి సారించారు. దీనిలో భాగంగా నీరు ఒక మోస్తరు సరిపోయే టమాట సాగు వల్ల లాభం గడించవచ్చని ఆలోచించిన రైతులు ఈ పంట సాగుకు కదిలారు. తద్వారా టమాటా సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. గతంలో కూరగాయల సాగులో టమాట 25 శాతంగా ఉండేది. అదే నేడు 45 శాతానికి పెరిగింది. ప్రతి సంవత్సరం జిల్లాలో ఖరీఫ్ కాలంలో 300 నుంచి 330 హెక్టార్ల వరకు టమాట ఫంట సాగు చేస్తారు. కానీ ఈ సంవత్సరం రెట్టింపు స్థాయిలో 650 హెక్టార్ల వరకు సాగు చేశారు. గతేడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటు వ్యవసాయాధికారులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పదే పదే సూచించిన దరిమిలా టమాట సాగు విస్తీర్ణం పెరిగింది.

● **ఒక్కసారిగా పడిపోయిన టమాట ధర**

సాగు పెరగడంతో పాటు దిగుబడి కూడా అధికంగా ఉండటంతో టమాట ధర ఒక్కసారిగా పడిపోయింది.గత నెల వరకు ధర ఆశాజనకంగా ఉండగా ఈ నెల అరంభం నుంచి ధరలు క్రమక్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. రెండు రోజులుగా భైంసా మార్కెట్ పరిధిలో టమాట ధరలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. ప్రస్తుతం హోల్ సెల్ మార్కెట్లో కిలో టమాట ధర రూ.2.లకు పడిపోయింది. ఈ క్రమంలో 25కిలోల బాక్స్ ఒక్కటి రూ.50తో అమ్ముడుపోతున్నాయి దిగుబడులు అధిక మొత్తంలో మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం లభిస్తున్న ధరలు పంటచేలలో టమాటలను తెంపేందుకు కూలీ చార్జీలు, దిగుబడులను మార్కెట్‌కు విక్రయించేందుకు తీసుకవచ్చే రవాణ చార్జీలు , తైబజారు చెల్లింపులకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. టమాటలు తెంపడానికి ఒక్కో కూలికి రోజు రూ.



200నుంచి రూ.250 చార్జీ చెల్లిస్తుండగా.. ఒక్కో కూలి రోజుకు 25 కిలోల సామర్థ్యం గల 15 బాక్స్‌లను నింపుతున్నాడు. ఒక్కో బాక్స్‌ను మార్కెట్‌కు తీసుకవచ్చేందుకు రవాణ చార్జీ కింద రూ10 నుంచి రూ.12 చెల్లించాల్సి వస్తోంది. ఇక తైబజార్ కింద ఒక్కో బాక్స్‌కు రూ.5 అప్పచెబుతున్నారు. ఇలా ఒక 25 కిలోల ఒక బాక్స్‌ను ఆటోలో మార్కెట్‌కు తెచ్చి తైబజార్ రుసుం చెల్లించి విక్రయాలు చేపట్టేందుకు గాను రూ.40 వరకు వ్యయమవుతోంది. ఒక బాక్స్ వెనుక అన్నదాతలకు కేవలం రూ.10వరకు మాత్రమే మిగులుతోంది. సాగు వ్యయభారం పెరుగుతూ పోతుండగా మార్కెట్‌లో ధరలు అంతంత మాత్రంగానే లభ్యమవుతుండటంతో రైతులు ఆందోళన చెందాల్సి వస్తోంది. ఏ పంట సాగు చేయాలన్నా ఎకరానికి ఎంత కాదన్నా రూ.15 నుంచి రూ.20 వేలు ఖర్చు అవుతోందని, దీనినైనా దృష్టిలో పెట్టుకొని అధికారులు కనీస ధర నిర్ణయించకపోవడంతో రైతులు నష్టపోయి దళారులకు లాభం చేకూరేలా మారిపోయింది.

టమాట పంట సాగు చేయాడానికి కేజీకి రూ.5 వరకు ఖర్చు అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చక్కటి టమాటను రైతులు విక్రయించాని చూస్తే దళారులు ఇచ్చే మాత్రం రూ.2. సాగు చేసిన రైతుకు కనీసం విత్తనాలకు పెట్టే ఖర్చు కూడా దక్కదని పరిస్థితి నెలకొంది. అంటే పంట సాగు చేసే రైతుకు కనీసం రూ.8 నుంచి రూ.10 వరకు అమ్మితే తప్ప గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. అలాంటి పంట నేడు 2.రూపాయలకు అమ్మితే రైతు ఎంత నష్టపోతాడన్న విషయం ఎవరికైనా సులభంగా అర్థమవుతుంది.

● **శీతల గిడ్డంగులు కరువే..**

కూరగాయలు ఎక్కువగా సాగు చేసే ఇక్కడి ప్రాంతంలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుడు, బెండ, వంకాయలు,ఆకుకూరలు మెంతికూర, కొత్తిమీర పాలకూర, తోటకూర తదితరులను ఎక్కువగా సాగు చేస్తారు. ఆకుకూరలు అతి సూక్ష్మ పంటలు కావడంతో ధర ఉన్నప్పుడు చేతికి వస్తేనే ఆదాయం. లేదంటే పొలంలో లేదా చెత్తకుప్పలలో పడేయాల్సిందే. ఇక కూరగాయలు కూడా సూక్ష్మరకం పంటలు అయినా వాటిని శీతల గిడ్డంగిలో ఉంచితే ధర ఉన్న సమయంలో అమ్ముకునేందుకు వీలుపడుతుంది. టమాట, వంకాయ, చిక్కుడు, బెండ దిగుబడులకు సంవత్సరంలో మూడు నుంచి నాలుగు నెలలో తప్పకుండా అధికంగా ధర అందుతుంది. ఆ సమయంలో రైతులు అమ్ముకునేందుకు శీతల గిడ్డంగులు ఉపయోగపడతాయి. కానీ వాటి ఏర్పాటు గురించి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇలాంటి ధరలు తగ్గిన సమయంలో పంటను శీతల గిడ్డంగులలో ఉంచితే ధర పలికినప్పుడు మంచి ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

● **వృథాగా పారవేస్తున్న రైతులు**

అధిక మొత్తంలో టమాట దిగుబడులు మార్కెట్‌కు తరలివస్తున్నాయి. ఇక్కడి కూరగాయల హోల్ సెల్ మార్కెట్ మొత్తం టమాట దిగుబడులతో నిండిపోతోంది. ఈ క్రమంలో వ్యాపారులు కొనుగోలు చేయగా మిగిలిపోయిన టమాట దిగుబడులను రైతులు ఇంటికి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు చెల్లించలేక ఇక్కడి ప్రాంతంలోనే వదలి పెడుతున్నారు. కొంత మంది రైతులు పారవేస్తున్నారు. ఇంకొందరు చేలలో తెంపకుండా పశువులను అందులో మేపడం పరిస్థితికి అద్దం పడుతోంది.

● **ప్రస్తుత పరిస్థితుల్లో నష్టాలు తప్పేటట్లు లేవు**

- చంద్రశేఖర్, కూరగాయల రైతు, తరోడా, ముథోల్ మండలం



గత సంవత్సరం ఆశించిన ధరలు లభించడంతో పాటు ఈ యేడు అధికార యంత్రాంగం సూచనల మేరకు ప్రత్యామ్నాయ సాగులో భాగంగా టమాట పంటను వేసాను. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం పూర్తిస్థాయిలో నిరాశాజనకంగా ఉంది. ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా నష్టాలు తప్పెటట్లుగా లేవు. వ్యయభారం ఇంతకింతకీ పెరుగగా ధరలు మాత్రం తగ్గుతూ పోతున్నాయి.

● **దయనీయ స్థితికి చేరుకున్నాం**

- కె.లక్ష్మణ్, కూరగాయల రైతు, మాంజ్రీ, భైంసా మండలం



టమాట పంట సాగుబడిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో రైతులు దయనీయ స్థితికి చేరుకున్నారు. పెట్టుబడి మాట చేతికి వచ్చుడు దేవుడెరుగు.. యేటా టమాట పంట సాగుతో తీవ్రమైన నష్టాలతో కష్టాలపాలవుతున్నాం. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో టమాట రైతులు మార్కెట్లో ధరల తగ్గుదలతో ఆందోళన చెందుతున్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 6,8,9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఆరోగ్యం మెరుగువుతుంది. ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పై అధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు, వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పొదుపు పథకాలు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): సమీక్షలకు అనుకూలం. గృహావసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. శుభవార్త అందుకుంటారు. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. జన సంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సంతతి విషయాల్లో శుభప్రదం. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు. దూరంలోఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృంద కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీ రంగాల వారు కీలక పదవులు అందుకుంటారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): కొత్త స్నేహాలు చిగురిస్తాయి బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది. ప్రమోషన్లకు అనుకూలం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): బృంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ



జాతర వద్ద భక్తుల సందడి

పచ్చబొట్లు వేసుకుంటున్న మహిళ

జాతరలో ఏర్పాటు చేసిన ఉయ్యాల

పెన్‌గంగకు పోటెత్తిన భక్తజనం

▸▸ గంగలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు ▸▸ పిండి వంటలతో గంగమ్మ తల్లికి నైవేద్యాలు ▸▸ సమాధుల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్, జనవరి5: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున గల ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పెన్‌గంగ జాతరకు శుక్రవారం భక్తజనం పోటెత్తింది. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాలకు సంబంధించిన ఆయా జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు, మహిళలు, పిల్లలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పెన్‌గంగ నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం గంగమ్మ తల్లికి వివిధ రకాల పిండి వంటలతో చేసిన నైవేద్యాన్ని సమర్పించారు. దీంతో పాటు పెన్‌గంగనది ఒడ్డున రామనంద్‌మహారాజ్, మాధవ్‌రావ్ మహారాజ్ పుణ్య సమాధులపై భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. పూర్ణనంద్ మహారాజ్ పాదుకల ద్వారా మహారాష్ట్రలోని పాటన్ బోరి నుంచి పెన్‌గంగ నదికి వచ్చిన రథానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్సులు, వివిధ వాహనాలతో పాటు ఎడ్లబండ్లపై భక్తులు తరలి రాగా జాతరలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాలు, హోటళ్ళు, పిల్లలు ఊగే ఉయ్యాలలు, ఎగ్జిబిషన్‌లు రద్దీగా మారింది. తమను చల్లంగా చూడాలని గంగమ్మ తల్లిని భక్తులు వేడుకున్నారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద జాతరగా పెన్‌గంగ జాతర మరో రెండు రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా పాటన్‌బోరి పూర్ణనంద్ మహారాజ్ సంస్థానం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాలు



ఎడ్లబండిపై పెన్‌గంగ జాతరకు వెళ్తున్న భక్తులు



జాతరలో భక్తులు గంగమ్మ తల్లికి సమర్పించే నాణెలను వెలికి తీస్తున్న దృశ్యం



గంగ వద్ద వనభోజనాలు చేస్తున్న భక్తులు

గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు





గంగమ్మతల్లికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ప్రపంచంలో ఎత్తయిన జలపాతం?

టిఆర్‌టి - 2017

సోషల్ స్టడీస్ కంటెంట్



నూతిపల్లి బాలరాజ్
స్కూల్ అసిస్టెంట్

భూమి - ఆవరణాలు

1. 1492లో భారతదేశానికి చేరాలని బయలు దేరిన కొలంబస్‌ది ఏ దేశం?
ఎ) స్పెయిన్ బి) పోర్చుగల్
సి) ఇంగ్లండ్ డి) ఇటలీ

2. ఐరోపా నుంచి పశ్చిమ దిశగా బయలుదేరిన కొలంబస్ ఏ దీవులకు చేరుకున్నాడు?
ఎ) ఇండోనేషియా బి) ఫిలిప్పీన్స్
సి) కరేబియన్ డి) జపాన్

3. భూమి ఎటువైపు భ్రమణం చేస్తుంది?
ఎ) పడమర నుంచి తూర్పునకు
బి) తూర్పు నుంచి పడమరకు
సి) ఉత్తరం నుంచి పశ్చిమానికి
డి) దక్షిణం నుంచి ఉత్తరానికి

4. ఉత్తర, దక్షిణ ధృవాల ద్వారా భూమి మధ్యగా గీసిన ఊహా రేఖను ఏమంటారు?
ఎ) కక్ష్య బి) అక్షం
సి) భూ నాభి డి) భూమధ్య రేఖ

5. 180^0 తూర్పు, పశ్చిమ రేఖాంశానికి మరోపేరు?
ఎ) గ్రీనిచ్ రేఖాంశం బి) 0^0 రేఖాంశం
సి) అంతర్జాతీయ దినరేఖ డి) భూమధ్య రేఖ

6. వీటిలో భూమిని సమాన అర్ధగోళాలు చేసేది?
ఎ) గ్రీనిచ్ రేఖ బి) భూమధ్య రేఖ
సి) అంతర్జాతీయ దిన రేఖ డి) 0^0 రేఖాంశం

7. 'లాటిట్యూడ్' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
ఎ) లాటిన్ బి) గ్రీక్
సి) రోమన్ డి) అరబిక్

8. లాటిట్యూడ్ అంటే అర్థం?
ఎ) పొడవు బి) నిలువు
సి) దూరం డి) వెడల్పు

9. Hemisphereలో Hemi అంటే అర్థం?
ఎ) అక్షాంశం బి) రేఖాంశం
సి) సగభాగం డి) పావు భాగం

10. అక్షాంశాల్లో పొడవు అనే పదానికి సమాన అర్థం ఇచ్చే పదం?
ఎ) లాటిట్యూడ్ బి) లాటిట్యూడో
సి) లాంగిట్యూడ్ డి) మెరిడియన్

11. వీటిలో రేఖాంశాలకు సంబంధించి సరికానిది?
ఎ) ఇవి పూర్తి వృత్తాలు కావు
బి) ప్రతి రేఖాంశం ప్రతి అక్షాంశాన్ని ఛేదిస్తుంది
సి) మొత్తం రేఖాంశాలు 180
డి) లండన్‌లోని గ్రీన్‌విచ్ రేఖాంశాన్ని 0^0 రేఖాంశం అంటారు

12. వీటిలో అక్షాంశాలకు సంబంధించి సరికానిది?
ఎ) ఇవి సమాంతర వృత్తాలు
బి) ధృవాల వైపునకు వెళ్తున్న కొద్దీ చిన్నవిగా అవుతాయి
సి) వీటి సంఖ్య 180
డి) భూమధ్య రేఖకు ఉత్తర ధృవానికి మధ్య భాగాన్ని దక్షిణార్థగోళం అంటారు

13. యాంటి మెరిడియన్ అంటే?
ఎ) 180^0 రేఖాంశం బి) 90^0 అక్షాంశం
సి) 60^0 అక్షాంశం డి) 0^0 రేఖాంశం

14. భూమి ఒక డిగ్రీ మేర కదలడానికి ఎంత సమయం పడుతుంది?
ఎ) 15 ని. బి) 30ని. సి) 1ని. డి) 4ని

15. మధ్యాహ్న రేఖలు అని వేటిని అంటారు?
ఎ) అక్షాంశాలు బి) రేఖాంశాలు
సి) ఆయన రేఖలు డి) ధృవాలు

16. గ్రీనిచ్ కంటే భారత కాలమానం?
ఎ) 5.30 గం. ముందు బి) 5.30 గంట వెనక
సి) 3.30గం. ముందు డి) 3.30 గంట వెనక

17. సముద్ర ప్రవాహాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రవహించడాన్ని ఏమంటారు?
ఎ) పోటు పాటులు బి) ప్రవాహాలు
సి) తరంగాలు డి) పైవేవీ కావు

18. సముద్ర ఉపరితల నీటి మట్టం హెచ్చు, తగ్గులను ఏమంటారు?
ఎ) పోటు పాటు బి) ప్రవాహాలు
సి) తరంగాలు డి) అలలు

19. సముద్రంలో నీటి మట్టం ప్రతి రోజూ పెరగడాన్ని, తగ్గడాన్ని ఏమంటారు?
ఎ) పోటు పాటు బి) ప్రవాహాలు
సి) తరంగాలు డి) అలలు


20. 'లితో' అంటే గ్రీక్ భాషలో అర్థం?
ఎ) బంతి బి) రాయి సి) నీరు డి) ఆవిరి

21. 'అట్మాస్ఫియర్'లో అట్మాస్ అనే గ్రీక్ పదానికి అర్థం?
ఎ) ప్రాణ వాయువు బి) నత్రజని
సి) జీవం డి) నీటి ఆవిరి

22. మధ్యధరా సముద్ర ద్వీప స్తంభం అని ఏ అగ్ని పర్వతాన్ని అంటారు?
ఎ) మౌంట్ పీలే బి) ఫుజియమా
సి) స్ట్రాంబోలి డి) ఏదీ కాదు

23. 'కిలిమంజారో' అగ్ని పర్వతం ఏ దేశంలో ఉంది?
ఎ) జపాన్ బి) ఇటలీ
సి) ఈక్వెడార్ డి) టాంజానియా

24. వీటిలో భారతదేశంలోని అగ్ని పర్వతం?
ఎ) నార్కొండం బి) మౌంట్ వెసువియస్
సి) మాయన్ డి) కోటోపాక్సి



25. సజీవంగా ఉన్న 3/4వ వంతు అగ్ని పర్వతాలు ఏ మహా సముద్ర అంచున ఉన్నాయి?
ఎ) హిందూ బి) అట్లాంటిక్
సి) ఆర్కిటిక్ డి) పసిఫిక్

26. ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్ల శిలలు బలహీనమై, పగిలిపోయే ప్రక్రియను ఏమంటారు?
ఎ) క్రమక్షయం బి) రవాణా
సి) శిలాశైథిల్యం డి) నిక్షేపణ

27. గాలి, నీటి శక్తుల కారణంగా భూమి ఉపరితలంపై పొరలు కొట్టుకుపోవడాన్ని ఏమంటారు?
ఎ) క్రమక్షయం బి) రవాణా
సి) శిలా శైథిల్యం డి) నిక్షేపణ

28. కొలొరాడో నది ప్రత్యేకత?
ఎ) యూరప్‌లో అతి పెద్దనది
బి) అతిపెద్ద జలపాతాన్ని కలిగి ఉంది
సి) అతి పెద్ద అగాధ ధరిని కలిగి ఉంది
డి) ఏడారి ప్రాంతంలో ప్రవహించేది

29. గోదావరి నదిపై బైసన్ గార్జ్ ఎక్కడుంది?
ఎ) రాజమండ్రి బి) పాపికొండలు
సి) బాసర డి) కందకుర్తి

30. నదులు V ఆకారం లోయను ఎక్కడ ఏర్పాటు చేస్తాయి?
ఎ) పర్వత ప్రాంతాల్లో బి) మైదాన ప్రాంతాల్లో
సి) సముద్ర తీరాల్లో డి) పైవేవీ కావు

31. ప్రపంచంలో ఎత్తయిన జలపాతం?
ఎ) నయాగరా బి) ఎంజెల్
సి) టుగెలా డి) జోగ్

32. ఎంజెల్ జలపాతం ఏ నదిపై ఉంది?
ఎ) చురుణ్ బి) అమెజాన్
సి) ఓల్గా డి) నైలు

33. భారతదేశంలో ఎత్తయిన జోగ్ జలపాతం ఏ నదిపై ఉంది?
ఎ) మహానది బి) దామోదర్
సి) శబర్మతి డి) శరావతి

34. వీటిలో ప్రపంచంలో అతిపెద్ద డెల్టాను కలిగి ఉన్న నది?
ఎ) గంగా బి) సింధూ
సి) గోదావరి డి) కృష్ణా

35. U ఆకారపు లోయలను ఏర్పాటు చేసేవి?
ఎ) నదులు బి) సముద్రాలు
సి) గాలులు డి) హిమానీ నదాలు

36. ట్రోపో ఆవరణం సగటు ఎత్తు ఎన్ని కి.మీ.?
ఎ) 8 బి) 10 సి) 13) డి) 18

37. ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఎక్కడ ఉంటుంది?
ఎ) భూమధ్య రేఖ బి) ధృవాలు
సి) ఆయన రేఖలు డి) పైవన్నీ

38. నీటి బిందువులు, బాష్పీభవనం, అవపాతం ఏ పొరలో కనిపిస్తాయి?
ఎ) ట్రోపో బి) స్ట్రాటో సి) థర్మో డి) మిసో

39. అన్నిటి కంటే పైన ఉండే ఆవరణం?
ఎ) స్ట్రాటో బి) మిసో సి) థర్మో డి) ఎక్సో

40. ఓజోన్ పొర ఏ ఆవరణంలో ఉంటుంది?
ఎ) ట్రోపో బి) స్ట్రాటో సి) థర్మో డి) మిసో

41. అయానో ఆవరణం అని దేనికి పేరు?
ఎ) మిసో బి) థర్మో సి) ఎక్సో డి) స్ట్రాటో

42. వీటిలో ఎత్తుకు వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గే ఆవరణం?
ఎ) స్ట్రాటో బి) మిసో సి) థర్మో డి) ట్రోపో

43. 'సాధారణ క్షీణతక్రమం' అంటే?
ఎ) పైకి వెళ్తున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గడం
బి) వాతావరణ పీడనం క్రమంగా క్షీణించడం
సి) గాలిలో నీటి ఆవిరి శాతం తగ్గడం
డి) ఉష్ణోగ్రలు వేగంగా తగ్గడం

44. వీటిలో సమశీతోష్ణ మండలాల్లో వీచే పవనాలు?
ఎ) వ్యాపార పవనలు బి) పశ్చిమ పవనాలు
సి) ధృవ పవనాలు డి) ఆగ్నేయ పవనాలు

45. 'మౌసమ్' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
ఎ) హిందీ బి) గ్రీక్ సి) అరబిక్ డి) దోమన్

46. 'చినూడ్' అనే పదానికి అర్థం?
ఎ) భారీ వర్షం బి) మంచును తినేది
సి) మంచు తుపాను డి) వడగాలులు

47. ఆల్ప్స్ పర్వతాల మీదుగా వీచే ఉష్ణ పవనం?
ఎ) చినూక్ బి) ఫోన్ సి) లూ డి) ప్యూనా

48. భారతదేశంలో మే-జూన్ నెలల్లో వీచే పవనాలు?
ఎ) పాంపెరొ బి) ప్యూనా సి) చినూక్ డి) లూ

49. బాగా ఎత్తులో ఉన్న మేఘాలను ఏమని పిలుస్తారు?
ఎ) సిర్రస్ బి) క్యుములస్
సి) నింబస్ డి) స్ట్రాటస్

50. ఒరోజెనిక్ వర్షపాతం అని దేనిని అంటారు?
ఎ) సంవాహన వర్షపాతం బి) పర్వతీయ వర్షపాతం
సి) చక్రవాత వర్షపాతం డి) పైవేవీ కావు

51. సైక్లోన్ అనే ఇంగ్లీష్ పదానికి మూలమైన గ్రీక్ పదం 'కైక్లోన్' అంటే అర్థం?
ఎ) తుఫాను
బి) చక్రీయ వర్షపాతం
సి) తిరుగుతున్న
డి) భారీ వర్షం

52. వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని ఏమంటారు?
ఎ) ద్రవీభవనం
బి) భాష్పీభవనం
సి) ఆర్ద్రత
డి) అవపాతం

53. అవపాతం ఏ రూపంలో ఉంటుంది?
ఎ) వర్షం బి) మంచు
సి) తుషారం, వడగండ్లు డి) పైవన్నీ

54. గాలి వేగాన్ని కొలిచే పరికరం?
ఎ) హైగ్రో మీటర్ బి) అనిమో మీటర్
సి) స్పీడో మీటర్ డి) భారమితి

55. ఆక్స్‌భౌ సరస్సులు వేటి ద్వారా ఏర్పడతాయి?
ఎ) గాలి ప్రవాహాలు బి) క్రమక్షయం
సి) నదీ ప్రవాహాలు డి) సముద్ర ప్రవాహాలు

56. జెట్ విమానాలు ఎగరడానికి అనుకూలమైన పొర?
ఎ) ట్రోపో ఆవరణం బి) స్ట్రాటో ఆవరణం
సి) మిసో ఆవరణం డి) థర్మో ఆవరణం

57. పశువులకిచ్చే ఔషధాల్లో డైక్లోఫినాక్‌ను వాడటం వల్ల అంతరించే స్థితికి చేరిన జాతి?
ఎ) పిచుకలు బి) రాబందులు
సి) చిరుతలు డి) పైవన్నీ

58. క్యోటో ప్రోటోకాల్ తీర్మానం చేసిన సంవత్సరం?
ఎ) 1995 బి) 1997 సి) 2000 డి) 2002

59. క్యోటో ప్రోటోకాల్ ప్రకారం హరిత గృహ వాయువును ఎంత శాతం కంటే తక్కువ చేయాలని తీర్మానించారు?
ఎ) 2 బి) 3.7 సి) 5.2 డి) 6.4

60. ఏ గడ్డి భూములను యురేషియాలో 'స్టెప్పీలు' అంటారు?
ఎ) ఉష్ణమండల బి) సమశీతోష్ణ మండల
సి) టండ్రా డి) పైవేవీ కావు

Answers

1) డి	13) ఎ	25)డి	37) ఎ	49) ఎ
2) సి	14) డి	26)సి	38) ఎ	50) బి
3) ఎ	15) బి	27)ఎ	39) డి	51) సి
4) బి	16) ఎ	28)సి	40) బి	52) సి
5) సి	17) బి	29)బి	41) బి	53) డి
6) బి	18) సి	30)ఎ	42) డి	54) బి
7) ఎ	19) ఎ	31) బి	43) ఎ	55) సి
8) డి	20) బి	32) ఎ	44) బి	56) బి
9) సి	21) డి	33) డి	45) సి	57) బి
10)సి	22) సి	34) ఎ	46) బి	58) బి
11) సి	23) డి	35) డి	47) బి	59) సి
12) డి	24) ఎ	36) సి	48) డి	60) బి

స్కాలర్‌షిప్స్

న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ & ట్రైనింగ్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్-2018

స్కాలర్‌షిప్స్ సంఖ్య: 650

జనరల్ స్కాలర్‌షిప్స్: 375, ట్రెడిషనల్ ఆర్టిస్ట్ ఫ్యామిలీస్: 125, ట్రైబల్ కల్చర్/ ఎస్టీ స్టూడెంట్స్: 100, డిఫరెంట్లీ ఏబుల్డ్: 20, క్రియేటివ్ రైటింగ్/లిటరసీ ఆర్ట్స్: 30

స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ.3,600. ప్రత్యేక శిక్షణ ట్యూషన్ ఫీజుల కింద సంవత్సరానికి రూ.9,000 రీయింబర్స్ చేసుకోవచ్చు.

విభాగాలు: మ్యూజిక్, డాన్స్, డ్రామా, పెయింటింగ్, స్కల్పచర్, క్రాఫ్ట్స్, లిటరరీ ఆర్ట్స్ ....

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ **చివరి తేదీ:** 2018 జనవరి 31

ఉచిత దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు: CCRT Regional Centre, Opp CII, New Google Office, Madhapur to Kondapur Main Road, Madhapur, Hyderabad - 500084

చిరునామా: Centre For Cultural Resources And Training, Plot No. 15 A, Sector - 7, Dwarka, New Delhi - 110075 **వెబ్‌సైట్:** www.ccrtindia.gov.in

ఫెలోషిప్స్

ఎన్‌ఐటి రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జూనియర్ రీసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

జూనియర్ రీసెర్చ్ ఫెలో: 01

అర్హత: ఎంటెక్/ఎంఇ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)

ఫెలోషిప్: మొదటి రెండు సంవత్సరాలు రూ.25,000. చివరి సంవత్సరం రూ.28,000.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్

చివరి తేదీ: 2018 జనవరి 10

చిరునామా:
Asst. Registrar, SRICCE,
National Institute of Technology,
Rourkela–769 008

వెబ్‌సైట్:
http://nitrkl.ac.in/OldWebsite/Jobs_Tenders/5ProjectFellowships/Default.aspx

SSC CGL TIER-II *MODEL PAPER*

ENGLISH LANGUAGE AND COMPREHENSION

Directions (1-20): The first and the last parts of the sentence are numbered 1 & 6. The rest of the sentence is split into four parts and named R Q, R, and S. These four parts are not given in their proper order. Read the sentence and find out which of the four combinations is correct. Then find the correct answer and indicate it in the Answer Sheet.

1. 1. Today, the earth has many satellites besides the moon.
P. But the pull of the earth keeps them from doing so.
Q. The artificial satellites do not fall because they are going too fast to do so.
R. They are the artificial satellites made by man and very much smaller than the moon.
S. As they speed along, they tend to go straight off into space.
6. As a result, they travel in an orbit round the earth,
(A) QPSR (B) PRQS (C) SPQR (D) RQSP

2. 1. Love is one of the earliest of human passions.
P. It is also one of the sweetest.
Q. Love should be directed towards a worthy object.
R. But, like all strong passions it may, if not well regulated and controlled, lead us into misery.
S. Or it will prove in the end a source of bitterness.
6. Love, moreover, looks forward to reciprocation,
(A) RQPS (B) PRQS (C) PQSR (D) QRPS

3. 1. A rocket, burns a fuel that makes a great deal of gas at the back of the rocket.
P. Ordinary fuel will burn only in air, because it needs the oxygen in the air.
Q. A rocket can, therefore, travel outside the atmosphere in space where there is no air.
R. This gas pushes against the rocket and sends it forward.
S. However, rocket fuels have their oxygen in them and so they burn without air.
6. In fact, it will travel faster in space than in the air because the friction of the air is not there to slow it down.
(A) QSRP (B) RPSQ (C) SQRP (D) PRQS

4. 1. Some of the other patrons are even more of a problem than the theatre itself.
P.They make noises and create disturbances at their seats.
Q. Some act as if they were at home in their own living room watching the TV set.
R. People are often messy, so that you're constantly aware of all the food they're eating.
S. Many people in the theatre often show themselves to be inconsiderate.
6. People are also always moving around near you,creat ing a disturbance and interrupting your enjoyment of the movie.
(A) SPQR (B) PSRP (C) QRSP (D) RSQP

5. 1. A friend's rudeness is much more damaging than a stranger's.
P. You feel hurt instead of angry.
Q. You feel that you're being taken for granted
R. When a friend says sharply. "I don't have time to talk to you now."
S. When a friend shows up late for lunch or a shopping trip, with no good reason.
6. Friends, after all, are supposed to make up for the thoughtless cruel ties of strangers.
(A) RPSQ (B) PRSQ (C) SPQR (D) QSPR

6. 1. Even though
P. the movie 'Avatar'
Q. at the Box Office
R. is doing wonders
S. some depict the movie as
6. being racist.
(A) SRPQ (B) PRQS (C) QSPR (D) RSPQ

7. 1. The dollar has been
P. and markets
Q. weak for months
R. have been fretting
S. over a host of
6. potential economic worries.
(A) PQRS (B) SRPQ (C) QRPS (D) QPRS

8. 1. Miffed over the issue
P. of not being given
Q. Chetan Bhagat continues
R. to spew anger
S. credit for the film '3 Idiots'
6. through his blog.
(A) RSPQ (B) PSQR (C) SPQR (D) SRPQ

9. 1. The developer of
P. leading real estate
Q. one of the
R. is Emma properties
S. the Burj Dubai project
6. developers in Dubai.
(A) PQSR (B) QSRP (C) SRQP (D) PSRQ

10. 1. The agencies shall submit the bid documents
P. their technical bid
Q. along with definite
R. documentary proof of
S. eligibility criteria in
6. as clearly mentioned.
(A) QRSP (B) QPRS (C) SRPQ (D) PQSR

11. 1. The Indian hockey players
P. have refused
Q. the training camp
R. to attend
S. and have gone
6. on an indefinite strike.
(A) QPSR (B) SRPQ (C) PQRS (D) PRQS

12. 1. Though things are
P. slowly fading away
Q. looking a little brighter
R. and recession is
S. the job market still remains
6. a little volatile.
(A) SRPQ (B) QRPS (C) SPQR (D) PQSR

13. 1. Inherited $ 3000 but it was not sufficient to start a zoo.
P. I discovered that most dealers would cram twenty creatures into a cage.
Q. So I decided to become an animal collector for zoos.
R. If they survived, they increased the price of the survivors.
S. But it proved to be a short lived career.
6. My cages were spacious and the animals well looked after: so I lost all my money.
(A) SQPR (B) QPSR (C) QSPR (D) PQSR

14. 1. It was not the sort of prize one could carry home at short notice.
P. However, they could make an exception in my case.
Q. He pointed at a notice that winners had to remove their prizes immediately.
R. They agreed to keep the engine at the grounds for a few days.
S. So I asked the showman if he could help me to transport it.
6. Then I would have to make my own arrangements to take it out.
(A) RSQP (B) SQPR (C) PRSQ (D) QSRP

15. 1. One day at school, Newton was kicked by a bigger boy from a higher class.
P. He also decided to beat him at lessons, and this made him study harder.
Q. So he turned on the bigger boy and gave him a good beating.
R. The kicking made Newton very angry.
S. After that he improved in his studies.
6. Perhaps the big boy who kicked Newton did a service to the world.
(A) QRSP (B) SPRQ (C) RSPQ (D) RQPS

16. 1. Newton's head was so full of ideas that he was often quite lost in his thoughts.
P. For a long time his guests waited for him to return.
Q. Soon the wine, the dinner and the guests were all forgotten.
R. Once, when he was entertaining some guests, he went out of the room to fetch some wine.
S. On his way to the wine cellar he passed his work table.
6. They searched and found him hard at work in his study.
(A) SQRP (B) RSQP (C) QPSR (D) PSRQ

17. 1. Socrates
P. never to make
Q. a great Greek Philosopher
R. and had resolved
S. tried hard to control himself
6. a show of his temper.
(A) SRPQ (B) QSRP (C) QSPR (D) PQRS

18. 1. Most editors
P. set aside pages or columns
Q. of magazines and newspapers
R. on events of the day
S. for letters of comment
6. or on articles in the publication.
(A) PQRS (B) QPSR (C) QPRS (D) RPQS

19. 1. Life was
P. had a way of leaving
Q. interests that Ross
R. the work for his examinations
S. so full of other
6. to the last minute.
(A) PRQS (B) SQPR (C) RQSP (D) SRQP

20. 1. My aunt and mother
P. to buy sweet-sour candies
Q. just to get
R. give us money
S. rid of us
6. in the afternoon.
(A) PQRS (B) RPQS (C) QRPS (D) SRPQ

Directions (21-40): Find out which part of a sentence has an error and blacken the oval (⬬) corresponding to the appropriate letter (A, B, C). If a sentence is free from error, blacken the oval corresponding to (D) in the Answer Sheet.

21. Not only most of the popular tele-serials in India are illogical (A) / in their story line (B) / but also crude in their presentation. (C) / No error (D).
22. I am trying to convince my brother (A) / for the last two days to come (B) / and live with me till father's anger cools down. (C) / No error (D).
23. It is a pity that a son (A) / born from very good parents (B) / should live a life of misery and deprivation of the worst order. (C) / No error (D).
24. I would have asked my friend (A) / to leave my house at once(B) / if my father would not have been at home and awake. (C) / No error (D).
25. My friends Rishi and Sohan (A) / are very industrious and sincere (B) / but I like the latter most. (C) / No error (D).
26. At night, a galaxy of stars are seen in the sky (A) / but in the light of the sun (B) / we are unable to see them. (C) / No error (D).
27. Nothing but books were set on fire in the building (A)/and other things (B) / remained intact. (C)/No error (D).
28. Cannot you see that the gentry (A) / is objecting to loud music ? (B) / You cannot play loud music here. (C) / No error (D).
29. Sir, your responsibilities includes (A) / working with the editors on all aspects (B) / of the editorial process. (C) / No error (D).
30. Please never insist to go out alone (A) / or I will have to (B) /lock you in the room. (C) /No error (D).
31. Reformatory measures adopted by the government (A)/ indicate that 1991 marked (B) / the end of an era. (C) / No error (D).
32. While grouping the words (A) / care have been taken to include the role (B) /that grammar plays in a language. (C) / No error (D).
33. Between the years 2000 from 2003 (A) /I worked as (B)/ the centre head of a small institute. (C)/No error (D).
34. She dare not to go out in a dark night, (A) / because she is a very (B) / timid kind of creature. (C)/No error (D).
35. Distrust seems to be a factor (A) / borne out of (B) / prevailing circumstances. (C) / No error (D).
36. America is neither in favour of arms race (A) / or in favour of (B) / simple nuclear disarmament. (C) / No error (D)
37. Naturalisation is the (A) / process by which (B) / a immigrant becomes a citizen of his new country. (C) / No error (D).
38. A high fat diet not only increases the risks (A) / of heart ailments (B) / however also that of other disorders. (C) / No error (D).
39. When two vowel sounds occurs in direct succession, (A) / the transition between them (B) / is often difficult to make.(C) / No error (D).
40. The perquisites was paid to (A) / avoid the impasse altogether, (B) /and to facilitate smooth functioning of the organization. (C) / No error(D).

KEY						
		11. D	17. B	23. B	29. A	35. B
1. D	6. B	12. B	18. B	24. C	30. A	36. B
2. B	7. D	13. C	19. B	25. C	31. B	37. C
3. B	8. B	14. B	20. B	26. A	32. B	38. C
4. C	9. C	15. D	21. A	27. A	33. A	39. A
5. A	10. A	16. B	22. A	28. *	34. A	40. A

(*): 'are' in place of 'is' as genttry is plural noun. Change 'cannot' into 'can't'

పై ప్రశ్నపత్రాన్ని 'నంద్యాల అకాడమి' నిపుణుల బృందం రూపొందించింది.

(మిగతా రేపటి పేజీలో)

ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలు



అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు అర్హులు. ఆయా పాఠశాలల్లో 2016-17, 2017-18 సంవత్సరాల్లో నిరవధికంగా చదివి ఉండాలి.

వయసు: 01-09-2016 నుంచి 31-08-2008 మధ్య జన్మించివారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా

ప్రవేశ పరీక్ష తేదీ: 2018 ఏప్రిల్ 8

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తు ప్రారంభం: 2018 జనవరి 16

చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: http://cse.ap.gov.in/DSE/

ఉట్నూర్

ఇంద్రవెల్లి మండల అధికారుల ఫోన్ నెంబర్లు

తహసీల్దార్	..	94910 53528
ఎంపీడీవో	..	97044 11940
ఏపీవో,ఈజీఎస్	..	80966 04177
ఏఈ, పీఆర్	..	98662 03058
ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్	..	99483 60734
ఎఫ్‌ఆర్వో	..	73826 00324
మెడికల్ ఆఫీసర్ (పిట్టబొంగరం)		97051 24381
ఏఈ, ట్రాన్స్‌కో	..	94408 11702
ఏఈ ఎంఐ	..	83330 84230
ఎస్ఐ	..	94409 00660
అగ్రికల్చర్ ఆఫీసర్	..	72888 94053
ఎంఈవో	..	94934 33739
ఏఈఐటీడీఏ	..	73826 27394
ఈవో గ్రామపంచాయతీ	..	94402 62687

మూడు ముక్కల్లో..

తాడిహత్నూర్‌లో మార్కెట్ బంద్

నార్నూర్ , జనవరి 5 : మండలంలోని తాడిహత్నూర్‌లో అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మార్కెట్‌లో శాంతియుతంగా బంద్ చేయించి సహకరించాలని కోరారు. నీలి రంగు జెండాలతో దళితులు తమ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాథోడ్ మధుకర్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని పూణేలో భీమాకోరేగాంలో దళితుల హక్కులకు భంగం కల్పించడం సమంజసం కాదని, ఇలా రోజురోజుకు దళిత, గిరిజనులపై అన్యాయం జరుగుతుందన్నారు. ప్రముఖ కవి రచయిత పండరి సూర్యవంశీ మాట్లాడుతూ జనవరి 1న దళితులకు అన్యాయం జరిగిందని ఇది అగ్రవర్ణాల వారి పని ఉంటుందని తాము అభిప్రాయ పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదవ్ సర్వదేవ్, చంద్రపాల్ వాగ్మారే, హర్షవర్ధన్, మటనకార్, దత్తుకాంబ్లే, చంద్రమణి, రాహుల్, రాజుకల్యాలే, లహూజిసాల్వే, యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఖాందేవ్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి'

నార్నూర్, జనవరి 5 : గత ఆరు దశాబ్దాలుగా తొడసం వంశీయుల దేవుడైన ఖాందేవ్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని తొడసం వంశీయుల పీఠాధిపతి తొడసం ఖమ్ము పటేల్, తొడసం సోనేరావు, మెస్రం నానాజీలు అన్నారు. మిషన్ భగీరథ కింద నీటి వసతి కల్పించాలని, స్త్రీ, పురుషులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అంతే కాకుండా భక్తుల సౌకర్యార్థం స్త్రీ, పురుషులకు వేరువేరుగా విశ్రాంతి భవనాలను నిర్మించాలన్నారు. దేవస్థానం సమీపంలో సీసీ రోడ్లను నిర్మించాలని, ప్రహరీ ఏర్పాటు చేయాలని, ఇందుకు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ నాగోరావు, తొడసం వంశీయులు తదితరులు పాల్గొన్నారు.

'రజక మహాసభను విజయవంతం చేయాలి'

ఇంద్రవెల్లి, జనవరి 5 : ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర రజక మహాసభలను విజయవంతం చేయాలని రజక సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు చిక్కుల్‌వార్ గజానంద్ కోరారు. శుక్రవారం సంఘం కార్యదర్శి బండేవార్ సంతోష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తర తరాలుగా మలిన బట్టలను శుభ్రం చేస్తు తమ వృత్తిని నమ్ముకొని దుర్భర జీవితం గడుపుతున్న రజకులను షెడ్యూల్ కులాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి జోగురామన్న, మాజీ మంత్రి బసవ రాజుసారయ్య, హాజరు కానున్నారని తెలిపారు.

దశాబ్దాలు గడుస్తున్నా.. పూర్తికాని కల్యాణ మండపం




అర్ధాంతరంగా నిలిచిన కల్యాణ మండప నిర్మాణ పనులు

» అర్ధాంతరంగా నిలిచిన పనులు
» ఆందోళనలో ప్రజలు

ఉట్నూర్ రూరల్ : దశాబ్దాలు గడుస్తున్నా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రారంభించిన కల్యాణ మండపం పనులు ముందుకు సాగక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాలకులు పట్టింపు కరువై పోవడంతో లక్షలు వెచ్చించిన అసంపూర్తిగా ఉన్న భవనం శిథిలమవుతోంది. ఉట్నూర్ పట్టణంలోని ప్రజలకు కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తేవడానికి 1999లో అప్పటి ప్రభుత్వం టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని మంజూరు చేయించింది. 1999లో అప్పటి మంత్రి గోడం నగేష్, ఎంపీ వేణుగోపాలచారి, ఎమ్మెల్యే గోవింద్ నాయక్‌ల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండు నెలల పాటు పనులు చేసినప్పటికీ కొన్ని అవాంతరాల వల్ల ఏర్పడిన వివాదాలతో కల్యాణ మండపం పనులు నిలిచి పోయాయి. ఈ స్థలం తమదంటూ ఒక రాజకీయ నాయకుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుతగలడంతో పది మందికి ఉపయోగ పడే కల్యాణ మండపం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన కల్యాణ మండపాన్ని ఇప్పటికైనా నాయకులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని పూర్తి చేయిస్తే పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కల్యాణ మండపం అందుబాటులోకి వస్తుందని ప్రజలు కోరుతున్నారు.

కల్యాణ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి..



అర్ధాంతరంగా నిలిచిపోయిన టీటీడీ కల్యాణ మండప నిర్మాణ పనులను ప్రభుత్వం స్పందించి వెంటనే పూర్తి చేయాలి. ప్రభుత్వం ద్వారా లక్షల నిధులు ఖర్చు చేసి అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండప భవనం శిథిలమవుతోంది.

-కస్తూరి భీమన్న, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు

'సమన్వయంతో మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఉట్నూర్, జనవరి 5 : ఉట్నూర్ డివిజన్‌లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికి ఇంటింటికీ తాగునీరు అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పనులను సమన్వయంతో అధికారులు పూర్తి చేయాలని ఉట్నూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్షా, సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని 450 గిరిజన గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించాల్సి ఉందని అన్నారు. పైపులైన్ల నిర్మాణంలో బీఎస్ఎన్ఎల్ కేబుల్ లైన్లకు ఆటంకం జరగకుండా మిషన్ భగీరథ అధికారులు పనులను నిర్వహించుకోనేలా సహకరించుకోవాలని అన్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో 149, ఇంద్రవెల్లి మండలంలో 146, ఉట్నూర్ మండలంలో 155 గ్రామాలకు తాగునీరు అందించే విధంగా ఆయా గ్రామాల్లో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ పథకాల వరకు లైన్లు పూర్తి చేయాలని అన్నారు. ఇప్పటి వరకు 82 శాతం పైపులైన్ల పనులు పూర్తయ్యాయని, గ్రామాల్లో అంతర్గతంగా కుళాయిలు ఏర్పాటు చేసుకొని నీరు అందించాల్సిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేష్, బీఎస్ఎన్ఎల్ ఎస్డీ ఈ జైరాం, జేటీవో నరేష్, ఎఈలు దేవిదాస్ పాల్గొన్నారు.

ఉగాదిలోపు 'డబుల్' పనులు పూర్తి చేయాలి

» ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్, జనవరి 5 : ఖానాపూర్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు ఉగాదిలోగా పూర్తి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్మాణంలో ఉన్న 80 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ అధికారులు డబుల్‌బెడ్ రూమ్‌ల నిర్మాణంలో జాప్యం చేస్తున్నారని, మిగిలిన గృహాలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగిస్తామని అన్నారు. మాడల్‌గా నిర్మించిన గృహాన్ని పరిశీలించి దానికి గులాబీ రంగును వేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం మొదటిసారిగా లక్షలాది రూపాయలు వెచ్చిస్తు ఇళ్లు లేని వారికి రెండు పడక గదులు నిర్మించి ఇవ్వడానికి కార్యక్రమం చేపట్టిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా పని చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఎంతో ఆశయంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కావాల్సినన్నీ నిధులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కాంట్రాక్టర్లకు ఇబ్బంది జరగకుండా త్వరితగతిన బిల్లులు చెల్లిస్తూ గృహనిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీపీ విమలరవి, జడ్పీటీసీ వాగ్మారే జగ్జీవన్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అజీమొద్దీన్, ఎంపీటీసీలు బెరిగెడి మనోహర్, కందుకూరి రమేష్, కోఆప్షన్ సభ్యుడు ముజీబ్ ఖాన్, పంద్రజైవంతరావు రవి, పోశక్క, సత్తన్న, ఎఈ తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో డబుల్‌బెడ్‌రూం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

'పవిత్రమైన జాతరను ప్రశాంతంగా నిర్వహించుకుందాం'

ఇంద్రవెల్లి, జనవరి 5 : రాష్ట్ర పండుగగా గుర్తించబడ్డ పవిత్రమైన నాగోబా జాతరను ప్రశాంతంగా నిర్వహించుకుందామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి సహాయ కలెక్టర్ గోపితో కలిసి నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర పాలనలో కేస్లాపూర్ నాగోబా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు కేటాయించిందని అన్నారు. సీఎం రాష్ట్ర ప్రజలకు కులాలు, మతాలాకతీతంగా సమాన దృష్టితో చూస్తు అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. నాగోబా జాతరకు వచ్చే భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. జాతర ఏర్పాట్లలో మెస్రం వంశీయుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అనంతరం ఇంద్రవెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో 62 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో రమాకాంత్, జడ్పీటీసీ దేవుపూజే సంగీత, నాయకులు సుఫియాన్ పాల్గొన్నారు.

'బాసరకు బస్సు నడపండి'

ఉట్నూర్‌రూరల్, జనవరి 5 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భైంసా డివిజన్‌లోని బాసరలో ఉన్న సరస్వతీ దేవి దర్శనానికి ప్రజలు వెళ్లే విధంగా బాసరకు ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాలతో పాటు జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ప్రజలు సరస్వతీ దేవి దర్శనం కోసం వెళ్లే విధంగా ఉట్నూర్ నుంచి బస్సును ప్రతి రోజు బస్సులు నడిపించాలని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బాసరకు నేరుగా బస్సు సౌకర్యం లేక అమ్మవారి దర్శనానికి భక్తులు తీవ్ర ఇబ్బందులెదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాసరకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.

ఇంటర్వ్యూ

ఏజెన్సీలో ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు


డాక్టర్ వసంత్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆంధ్రజ్యోతి: ఏజెన్సీలోని ప్రజలకు వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు?

డీడీఎంహెచ్‌వో: ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్, శ్యాంపూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి మండలంలో పిట్టబొంగరం, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలంలో నార్నూర్, గాదిగూడ మండలంలో ఝరి, గాదిగూడలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చాం.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాలలో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా ?

డీడీఎంహెచ్‌వో: నాలుగు మండలాల్లోని ఎనిమిది పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సబ్‌సెంటర్లు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ఏఎన్‌ఎంలు స్థానికంగా ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఏజెన్సీలో జ్వరాల పరిస్థితి ఏమిటి ?

డీడీఎంహెచ్‌వో: ప్రస్తుతం ఏజెన్సీలోని గ్రామాలలో అంటువ్యాధులు అదుపులో ఉన్నాయి. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై చైతన్యం కల్పించడం ద్వారా వ్యాధులు ప్రబలిన వెంటనే ప్రజలు వైద్య సేవలు అందుకుంటున్నారు. పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

-ఉట్నూర్ రూరల్

ఆంధ్రజ్యోతి 13
నిర్మల్ • శనివారం 6 జనవరి 2018
www.andhrajyothy.com

ఖానాపూర్

నేడు ఖానాపూర్‌లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖానాపూర్, జనవరి 5 : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఖానాపూర్ పీఏసీఎస్ సీఈవో అశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. క్వింటాల్ కందుల ధర రూ. 5,450 ఉంటుందని విక్రయించే కందుల తేమ 14శాతం ఉండాలన్నారు. వీఆర్‌వీ, ఎంఏవో ధృవీకరణ పత్రం, పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలను తప్పకుండా రైతులు వెంట తీసుకొని రావాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవీ.. ఇవీ..

'గడువులోగా పనులు పూర్తి చేయాలి'

కడెం జనవరి 5: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనులను గడువులోగా పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. కడెం ప్రాజెక్టులో చేపడుతున్న మిషన్ భగీరథ పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. కడెం, దస్తూరాబాద్, ఖానాపూర్ మండలాలకు ఫిబ్రవరి నెలలోగా పెంబి, జన్నారం మండలాలకు మే నెలలోపు నీరందిస్తామని అధికారులు తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నయ్య, ఎంపీటీసీ గంగాధర్, టీఆర్ఎస్ నాయకులు సత్తన్న, కోల గంగన్న, ఆసీఫ్, గౌసోద్దీన్, మనోహర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

ఖానాపూర్, జనవరి 5: ఖానాపూర్ మార్కండేయ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పద్మశాలి సంఘం, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రూ. 30లక్షల నిధులు మంజూరు చేయాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తన వంతుగా రూ. 1లక్ష మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయంసి చైర్మన్ సక్కారాం శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు అల్లాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బిల్లా శంకర్, పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాస్, గంగరాజం, జంగాల రాజ శంకర్, బిల్లా రాజేశ్వర్, తదితరులున్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

కడెం , జనవరి 5 : మండలంలోని నచ్చనెల్లాపూర్ పంచాయతీ పరిధిలోని గొండుగూడ గ్రామానికి గిరిజనులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బొడ్డు గంగన్న, కో ఆర్డినేటర్ వేముల శ్రీనివాస్, గంధం మహేందర్, బండారు వెంకటేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దస్తూరాబాద్, జనవరి 5 : మండలంలోని మున్యాల్ గ్రామంలో శుక్రవారం వెనకబడిన తరగతుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం అధ్యక్షుడు సముద్రాల వెంకటి వర్మ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముంచు వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా దీటి సత్యం, కోశాధికారిగా సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షులుగా హన్స గౌడ్, ఉపాధ్యక్షులుగా చిలుకయ్య, సురేందర్, రమేష్, సంయుక్త కార్యదర్శులుగా భూమేష్, మహేశ్, అధికార ప్రతినిధిగా లుగా తదితరులు ఎన్నికయ్యారు.

10లో టార్గెట్..10 జీపీఏ


విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

పెంబి, జనవరి 5 : పదో తరగతి విద్యార్థుల టార్గెట్ 10 జీపీఏ సాధించడమే. పదో దరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మార్చి 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒక వైపు విద్యార్థుల్లో పరీక్షల భయం, మరోవైపు ఉపాధ్యాయులకు సిలబస్‌పూర్తి చేయాలనే ఒత్తిడి, తమ పిల్లలకు మంచి జీపీఏ రావాలనే తల్లి దండ్రుల ఆరాటం, ఇలా అందరిది ఒకటే టార్గెట్ మార్క్. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు సబ్జెక్ట్‌పై పూర్తి అవగాహన, ఆత్మవిశ్వాసం, పక్కా ప్రణాళికతో పాటు సమయపాలన పాటిస్తూ, ఏకాగ్రతతో చదివితే ప్రతిభ కనబర్చవచ్చు. ప్రైవేట్ పాఠశాలల్లో చాలా రోజుల నుంచే అదనపు తరగతులను నిర్వ హిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పది విద్యార్థులకు ఉదయం, సాయం త్రం అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసెకెళ్లెందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలోలా కాకుండా మూడేళ్లగా నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానంలో పరీక్షలు జరుగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా విద్యార్థులు బట్టీవిధానాన్ని వీడి, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే విజయం సాధించవచ్చని నిర్లక్ష్యం వహించకుండా ఏకాగ్రతతో చదివితేనే పది జీపీఏ సాధించవచ్చని నిపుణులైన ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

భయం వీడి సాధన చేయాలి



చాలామంది విద్యార్థులు మిగిత సబ్జెక్టుల మాదిరిగా కాకుండా లెక్కలంటే భయపడుతారు. ఒకటి రెండుసార్లు సాధన చేసినా టిపై అవగాహనపెంచుకోవాలి. అధ్యాయాల వారిగా సాధన మంచిది. ముందుగా అభ్యాసాల్లో ఇచ్చిన లెక్కలను చేయాలి. ఇలా చేయడంతో గణితంలో పట్టు సాధించడం చాల సులువు, లెక్కలు చేసే టప్పుడు ఒక్క అంశాన్ని పార్ములాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. చిన్న తప్పులకు ఆస్కారం ఇవ్వకూడదు.

- నర్సయ్య, గణిత ఉపాధ్యాయుడు

ఆత్మవిశ్వాసంతో చదవాలి



విద్యార్థులు అనవసర భయాందోళనలకు గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో చదవాలి, బ్లూప్రింట్ ఆధారంగా చేసుకుని పుస్తకంలోని అంశాలను చదవడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చు సీసీఈ ఆధారంగా పాఠ్యాంశాలను బోధించడం, కారణాలను విశ్లేషించడం, ప్రయోగాలు, అమలు చేసే విధానం, పలితాలు స్లొగన్స్ రాయడం ఉదాహరణలు, పట్టికలు, బొమ్మల ఆధారంగా విశ్లేషణ చేసి రాయాలి, చదివిన విషయాన్ని రాయాలి.

- తారాచంద్, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు

భాషపై పట్టు సాధించాలి..



విద్యార్థులు ముందుగా భాషపై పట్టు పెంచుకోవాలి, పట్టు లేకపోవడంతో కొన్ని ప్రశ్నలకు జవాబులు తెలిసిన రాయలేక పోతారు. అలాంటప్పుడు మార్కులు తగ్గే అవకాశముంది. పద్యాలు, వ్యాకరణం పాఠ్యాంశాల గురించి పూర్తిగా తెలిసి ఉండాలి. హిందీలో వివిధ రకాల చుట్టి పత్రాల గురించి అవగాహన ఉండాలి. ఎవరికి పత్రం రాయాలన్న రాసేలా సాధన చేయడంతో మార్కులు సాధించవచ్చు.

- దేవిదాస్, హిందీ ఉపాధ్యాయుడు

ఇంటర్వ్యూ

గ్రామాల్లో ప్రతీ ఒక్కరు మరుగుదొడ్డి నిర్మించుకోవాలి


వినోద్, పంచాయతీ కార్యదర్శి

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కృషిచేస్తున్నారా..?
అధికారి: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రత్యేక కృషి చేస్తున్నాం. పెంబిలో వందశాతం మరుగుదొడ్లను నిర్మిస్తాం.
ఆంధ్రజ్యోతి: గ్రామంలో పరిశుభ్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
అధికారి: గ్రామంలో ప్రతిరోజు తమ పారిశుద్ధ్య సిబ్బంది స్వచ్ఛభారత్ రిక్షాలతో ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నివారణకు ప్రత్యేకంగా గ్రామస్తులు వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్నాం.
ఆంధ్రజ్యోతి: గ్రామంలో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు?
అధికారి: అలాంటి సమస్య మాదృష్టికి రాలేదు, మాదృష్టికి వస్తే సమస్యకు పరిష్కారం చూపుతాం.
ఆంధ్రజ్యోతి: గ్రామంలో కొన్ని వాడల్లో వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మా దృష్టికి వచ్చింది దీనిపై మీ సమాధానం?
అధికారి: పెంబిలో ఎలాంటి ఇబ్బందులు లేవు, ఏవాడలో వీధి దీపాలు లేవో వెంటనే వీధి దీపాలు పెట్టిస్తాం.
ఆంధ్రజ్యోతి: వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
అధికారి: నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

-పెంబి, జనవరి 5

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● ఈవోపీఆర్డీ చిక్యాల రత్నాకర్‌రావు


మాట్లాడుతున్న రత్నాకర్‌రావు

ఖానాపూర్ రూరల్ : జనవరి 05 : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈవోపీఆర్డీ చిక్యాల రత్నాకర్ రావు అన్నారు. ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు చక్రాల బండిని ఉపయోగించి వీధుల్లో ఉన్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని, జీపీ నిధుల నుంచి పారిశుధ్యం కోసం నిధులు ఉపయోగించాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా చెత్త నిల్వ చేయరాదని సూచించారు. తాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ చిన్నబాపు, సర్పంచ్ శ్రీనివాస్, ఏఎన్‌యం స్వాతి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌ల పంపిణీ

ఖానాపూర్ రూరల్, జనవరి 5 : ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ భర్త కట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్ పాస్‌లను పంపిణీ చేశారు. దివ్యాంగుల సౌకర్యార్థమై 40 మంది వరకు ఉచిత పాసులను అందించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ చిక్యాల రత్నాకర్ రావు, నాయకులు గోపు రత్నం, గాండ్ల శ్రీనివాస్, వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య తదితరులున్నారు.

వాడివేడిగా సాగిన లక్ష్మణచాంద సర్వసభ్య సమావేశం

▸▸ అధికారుల తీరుపై సభ్యుల అసహనం

లక్ష్మణచాంద : జనవరి 5 : మండలకేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. ఉదయం 11గంటలకు మండలాధ్యక్షురాలు గుజ్జారి కౌసల్య గణేష్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశం పలు అంశాలపై చర్చించారు. మొత్తం 28 ఏజెండా అంశాలకు గాను 17 అంశాలపై చర్చ పూర్తి చేశారు. ఆ ప్రాధాన్యత అధికారుల గైర్హాజరీ కారణంగా మిగతా అంశాలపై చర్చ జరగలేదు. ముఖ్యంగా విద్య, వైద్యం, నిత్యవసరాలు, ఇంజనీరింగ్, గ్రామీణ, తాగునీటి సరఫరా, ఈజీఎస్, విద్యుత్, ఐకేపీ, రోడ్డు రవాణా, స్త్రీ శిశు సంక్షేమం, పంచాయతీ, కస్తూర్బా తదితర అంశాలపై ఎంపీడీవో శకుంతల సమన్వయంతో చర్చ కొనసాగింది. వైద్యశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కేసీఆర్ కిట్, ఇతర ప్రసూతి ప్రోత్సాహకాలు, ఇమ్యూనైజేషన్ గూర్చి వెల్మల్ బొప్పారం వైద్యాధికారిణి నిఖిల రాణి సభ్యులకు వివరించింది. ఈ సందర్భంగా కనకాపూర్ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్, కూచన్‌పల్లి సర్పంచ్ బండి లింగన్నలు వైద్యాధికారుల పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై తమకు సమాచారం ఇవ్వడం అసహ నం వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల పంపిణీ రెవెన్యూ శాఖకు సంబంధించి తహసీల్దార్ నారాయణ రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ మండలంలో 85శాతం పూర్తయ్యిందని తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరాకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ దివ్య మండలంలో మిషన భగీరథ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో వీటిని పూర్తి చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా చింతల్‌చాంద ఎంపీటీసీ రాజేశ్వర్ మాట్లాడుతూ గ్రామంలో గల సీసీ రోడ్లను పాడు చేయకుండా పైప్‌లైన్ నిర్మాణం చేయాలని కోరారు.

పలు అంశాలపై తీర్మానం..

అనంతరం లక్ష్మణచాంద ఆనకట్ట ద్వారా రైతుల సౌకర్యం కోసం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని, వృద్ధులకు పింఛన్‌లు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులకు నిధులు కేటాయించాలని, సీసీ రోడ్లను ఎంపీటీసీలే చేపట్టేలా తీర్మాణం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ గుజ్జారి కౌసల్య గణేష్, జడ్పీటీసీ అడ్వాల పద్మ రమేష్, వైస్ ఎంపీపీ కొండ్ర లక్ష్మీ, ఎంపీడీఓ శకుంతల, ఈవోపీఆర్డీ వనజ, తహసీల్దార్ నారాయణ, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

దస్తూరాబాద్, జనవరి 5 : దస్తూరాబాద్ మండల కేంద్రానికి చెందిన రామగిరి దర్శక్క అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. శుక్రవారం పేరుకపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు ముంచు వెంకన్న బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మారవేణి గంగన్న, అరుగుల నాగన్న, సంపత్ కుమార్, బిరెగెల దశరథ్, రాజేందర్, రాజారెడ్డి, గంగాధర్, శేఖర్, ఎంపీటీసీ నర్సయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

అవీ.. ఇవీ..



పాల శీతలీకరణ కేంద్రంలో పరిశీలిస్తున్న సీఎండీ

పాడి పరిశ్రమ రైతులను ప్రోత్సహించాలి

» సీఎండీ నిర్మల

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 5: రాష్ట్రంలో రైతులు ఎక్కువగా వ్యవసాయంపై ఆధార పడుతున్నారని, పంటలు పండని సమయంలో తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అందుకు ప్రత్యామ్నయంగా పాడి రైతులను ప్రోత్సహించాలని పాడి పరిశ్రమ సీఎండీ నిర్మల అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రాన్ని సందర్శించి పాడి గేదెల పెంపకాన్ని, పాలశీతాలీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచేందుకు పాడి రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంపై ఆధారపడకుండా రైతులను పాడి పరిశ్రమవైపు కూడా ఆసక్తి కనబర్చేలా అవగాహన కల్పించాలని కోరారు. పాడి రైతులను ప్రోత్సహించినట్లయితే వారికి ఆర్థికంగా ఆసరాగా ఉంటుందన్నారు. రైతులు పాలశీతలీకరణ కేంద్రానికి పాలను అధికంగా తెచ్చేలా చూడాలన్నారు. ఇందులో డీడీ నాగేశ్వర్‌రావు, ఈఈ దేవందర్, పాలశీతలీకరణ జీఎం శ్రావణ్‌కుమార్‌లున్నారు.



కేంద్రంలో పాలని పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్

'పాల ఉత్పత్తుల అభివృద్ధికి సర్కారు కృషి'

నిర్మల్‌టౌన్, జనవరి 5: రాష్ట్ర వ్యాప్తంగా పాల ఉత్పత్తులను పెంపొందించి మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని విజయ పాల డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, నిర్మల్ కలెక్టర్ ప్రశాంతి అన్నారు. సోఫీనగర్‌లో పాల డెయిరీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. రూ. 50లక్షల వ్యయంతో క్రొతగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించిన వారు వారం రోజుల లోపలికి పాత శీతలీకరణ యంత్రాలను మార్పిడి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని జిల్లాలో పాడి పరిశ్రమ సమైఖ్య సంఘాలను ఏర్పాటు చేసి ఆ సంఘాల ద్వారా పాల ఉత్పత్తిని పెంపొందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ దేవేందర్ రెడ్డి, విజయ డెయిరీ నిర్వహకులు నాగేశ్వర్‌రావు, రవి, రమణారెడ్డి, ఐకేపీ సభ్యులు పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఆమె చుట్టూ.. వేధింపుల ఉచ్చు!

» గడిచిన యేడాదిలోనే 275 వేధింపుల కేసులు

» మహిళలపై ఆగని అఘాయిత్యాలు

» కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల అన్న అక్కసుతో ఒకడు.. ప్రేమించడం లేదని మరోకడు.. వరకట్న వేధింపులతో ఇంకొక్కడు.. ఇలా రక్తపుముద్ద ఆడరూపం దాల్చినప్పటి నుంచి కనుమూసే వరకు వివిధ రకాలుగా మహిళలను వేధింపులకు గురి చేస్తూ అంతమొందిస్తునే ఉన్నారు. మందు.. విందు.. పసందు.. నెత్తికెక్కితే ఎంతకైనా తెగిస్తున్నాడు మగాడు. ఇటీవల గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టు కావడం కూడా ఇలాంటి కోవకే చెందిందంటున్నారు. ఈ సంఘటనతో యావత్ రాష్ట్రమంతా కలకలం రేపుతోంది. ఇలాంటి సంఘటనలే ఆదిలాబాద్ జిల్లాలో కూడా తరుచు చోటు చేసుకోవడం ఆందోళనకు దారి తీస్తోంది. గడిచిన 2017 లోనే జిల్లావ్యాప్తంగా 275 మహిళ వేధింపు కేసులు నమోదు కాగ, అందులో ఆత్యాచారం కేసులు 17, మరో 258 కేసులు మహిళలను వివిధ రకాలుగా వేధింపులకు గురి చేసినవి కావడం గమనార్హం. గత 2016లో 27ఆత్యాచార కేసులు కాగ, 320 వేధింపు కేసులుగా పోలీసులు నమోదు చేశారు. గత రెండేళ్లలో కేసుల నమోదు కాస్త తగ్గు ముఖం పట్టిన మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదంటున్నారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇండ్లలో మహిళలు వేదింపులకు గురవుతునే ఉన్నారు. అయితే నేరాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోక పోవడతోనే అఘాయిత్యాలు పెరిగి పోతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● **వింటే సరే.. లేదంటే దాడే!!**

వింటే సరే.. కాదు కూడదు అంటే కామాంధులు రెచ్చిపోయి దాడులకు ఎగబడుతున్నారు. గత నెల రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటున్న ఓ యువతిపై ప్రేమ పేరిట వేధిస్తూ తన మాట కాదన్నదని ఆ యువతిపై ఓ యువకుడు బీరు సీసాతో దాడికి దిగడంతో యువతి తీవ్ర గాయాలపాలైంది. ఈ సంఘటనను మరిచి పోక ముందే జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన వివాహిత పై కట్టుకున్న భర్తనే కిరోసిన్ పోసి నిప్పంటించిన సంఘటన జిల్లాలో కలకలం రేపింది. నిత్యం ఇలా ఏదో ఓ చోట మహిళలపై వేధింపులు జరుగుతునే ఉన్నాయి. కొన్ని సంఘటనలు వెలుగు చూస్తున్న పరువు పోతుందన్న కారణంగా మరెన్నో సంఘటనలు కాలగర్భంలోనే కలిసి పోతున్నాయి. మహిళల వేధింపుల పై ఎన్నో కేసులు నమోదవుతున్న కొందరు తమ ఆర్థిక, రాజకీయ పలుకుబడితో శిక్షల నుంచి తప్పించుకుంటున్నారు. గ్రామ పెద్దలు, పోలీసులు రాజీ కుదర్చడంతో సులువుగా కటకటలా నుంచి బయట పడుతున్నారు. ఇటీవల షీ టీంల పర్యవేక్షణతో కొంత మేరకు అడ్డుకట్ట పడుతున్న గుట్టుచప్పుడు కాకుండా ఎన్నో అఘాయిత్యాలు జరిగి పోతునే ఉన్నాయి.



ఇటీవల దాడికి గురైన యువతిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు(ఫైల్)

● **కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్నారు**

మహిళ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని లొంగదీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఏదైనా సంఘటన వెలుగులోకి వస్తేనే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారే తప్పా ఫిర్యాదు అందలేదన్న కారణంతో వదిలేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కొన్ని గ్రామాల్లో కుల పెద్దలే నష్ట పరిహారం చెల్లిస్తూ బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. పోలీసుల వద్దకు వెళ్తే అడప దడపగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప, మార్పు దిశగా కనీస ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే ఓసారి తప్పు చేసిన వ్యక్తి మరోసారి తప్పు చేయకుండా కఠినంగా వ్యవహరించక పోవడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. మహిళల రక్షణ చట్టాల పై పెద్దఎత్తున ప్రచారం చేస్తే కొంత మేరకైనా మహిళల పై వేధింపులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు.

● **ఇవీ చట్టాలు**

ఇండియన్ పినల్ కోర్టు ప్రకారం మహిళలను ఏ రూపంలో వేధింపులకు గురి చేసిన శిక్షార్హులే అవుతారు. మహిళల ముందు అశ్లీల చేష్టలు, పాటలు పాడిన 294(ఎ,బి) ప్రకారం శిక్ష పడే అవకాశం ఉంది. అశ్లీల పుస్తకాలు, బొమ్మలు చూపిన సెక్షన్ 292 ప్రకారం, వెకిలి చేష్టలు, అసభ్య ప్రవర్ధన, బూతు కామెంట్లు చేసిన సెక్షన్ 509, లైంగిక దాడికి పాల్పడిన సెక్షన్ 354, అత్యాచారం చేస్తే సెక్షన్ 375, 376 ప్రకారం, మహిళల పట్ల భర్త, బంధువులు క్రురంగా ప్రవర్ధించిన 498(ఎ) సెక్షన్ల కింద నిందితులకు కఠిన శిక్షలు పడే అవకాశం ఉంటుంది. మహిళలు చట్టాలపై అవగహన కలిగి ఉన్నప్పుడే చట్టం నుంచి రక్షణ పొందే వీలుంటుంది.

● **కఠిన చర్యలు తీసుకుంటున్నాం**

- నర్సింహారెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ



మహిళలను వేధింపులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అలాగే షీ టీంలను అప్రమత్తం చేస్తూ ఆకతాయిల ఆగడాలు కట్టిస్తున్నాం. వేధింపులకు గురయ్యే మహిళలు పోలీసులకు సమాచారం అందజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. పలు కళాశాలల్లో మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. జన సంచార ప్రదేశాలలో మరింత నిఘాను పెంచుతాం. నేరానికి పాల్పడిన వారు ఏస్థాయిలో ఉన్న వదిలి పెట్టేది లేదు.

ముగిసిన 'భూ ప్రక్షాళన'!

» పక్కాగా భూముల లెక్కా » నిర్మల్ జిల్లాలో వివాదాస్పద భూములకు పరిష్కారం

నిర్మల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 428 రెవెన్యూ గ్రామాల్లో 8.65.625 ఎకరాల భూ ప్రక్షాళన పూర్తయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సెప్టెంబర్ నెలలో ప్రారంభించిన భూప్రక్షాళన గడువులోగా పూర్తయిన నేపథ్యంలో జిల్లాలో భూముల ప్రక్షాళన దాదాపు పూర్తయినట్లే. రెవెన్యూ అదికారుల సమాచారం మేరకు 22.614 ఎకరాలు వివాదాస్పదమైన భూములు కాగా 97శాతం వరకు ఎలాంటి వివాదాలు లేనివిగా తేల్చారు. 4.76.929 సర్వే నెంబర్‌తో జిల్లా వ్యాప్తంగా సర్వే పూర్తి చేశారు. 4.50.136 సర్వే నెంబర్లు ఎలాంటి వివాదాలు లేవు. కాగా 2.25.361 సాఫీగా ఉన్నాయి. 2 లక్షల207 ఎకరాలు అటవీ శాఖ భూములుండగా 11.093 వివాదాస్పదంలో ఉన్నాయి. 7506 ఎకరాలు వక్ఫ్ భూములు, కాగా 2044 వివాదాస్పదంలో ఉన్నాయి. దేవాదాయ, ధర్మదాయ శాఖకు చెందినవి 828 ఎకరాలు కాగా 87 వివాదంలో ఉన్నాయి. వ్యవసాయేతర భూములు 22855 ఎకరాలు కాగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితరమ్మైన 40125 ఎకరాలున్నట్లుగా ఇప్పటి వరకు గుర్తించారు. ఒక్కొక్క గ్రామంలో పది రోజుల పాటు అదికారుల బృందం మకాం వేసి భూముల లెక్కలు పక్కాగా తేల్చారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ దారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ అందించే పంట పెట్టుబడి ఈ భూ ప్రక్షాళన ఆధారంగానే కానుండడంతో వ్యవసాయ కుటుంబాలు తమ భూముల భూ ప్రక్షాళనలో నిర్ధారించుకొని ప్రభుత్వం నుంచి గుర్తింపుపత్రం పొందారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యేలను సైతం భూప్రక్షాళన కార్యక్రమం పూర్తయ్యే వరకు నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించడంతో భూ ప్రక్షాళన కార్యక్రమంపైనే దృష్టి సారించారు. గ్రామాల్లోని రైతులు కొత్తగా ఏర్పడ్డ రైతు సేవా సమితులతో పాటు భూ యజమానులు దీక్షలో పాల్గొని విజయానికి కృషి చేశారు. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మూడు నెలల పాటు భూ ప్రక్షాళన కొనసాగింది.



నిర్మల్ జిల్లాలో రైతులకు వన్-బి పత్రాలు అందిస్తున్న దృశ్యం(ఫైల్)

● **26నుంచి పాస్ పుస్తకాలు**

ప్రభుత్వ ఆదేశానుసారంగా పూర్తయిన భూ ప్రక్షాళనలో లెక్క పక్కాగా తేలగా.. వివరాలు కంప్యూటరీకరించారు. వీటి ఆధారంగా రాబోయే రోజుల్లో రైతులకు ప్రయోజనం లభించనుంది. జనవరి 26 నుంచి కొత్త పాస్ పుస్తకాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో పట్టెదారు పాస్ పుస్తకాలు, హక్కు పత్రం జారీ చేయగా ప్రస్తుతం ఒకే పాస్ పుస్తకాన్ని అందజేయనున్నారు.

● **పారదర్శకంగా భూ ప్రక్షాళన : జేసీ శివలింగయ్య**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూప్రక్షాళన నిర్మల్ జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాం. సమస్యాత్మకం మినహా మిగిలిన భూముల వివరాలు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కంప్యూటరీకరించాం. జనవరి 26వ తేదీ తరువాత ప్రభుత్వం రైతులకు పాస్ పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందరి సమన్వయంతో సకాలంలో భూ ప్రక్షాళన పూర్తి చేశాం.

సామర్థ్యాల సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : రాష్ట్ర బృందం

నిర్మల్‌కల్చరల్, జనవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యాసన సామర్థ్యల సాధనలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహించాలని రాష్ట్ర పరిశీలన బృందం స్పష్టం చేసింది. నిర్మల్ జిల్లాలోని పలు పాఠశాలల్లో రెండు రోజుల పాటు బృందం పర్యటించింది. నిర్మల్ డీఈవో ప్రణీత అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో పరిశీలకుల బృందం పలు అభిప్రాయాలు వ్యక్తం చేసింది. విద్యార్థులు చదవడం, రాయడం, గణితంలో సామర్థ్యాలు నిరంతరం మూల్యంకనం చేశారు. లఘు పరీక్షలు, పుస్తక పఠనం, ప్రాజెక్టుల తయారీ, తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, సెక్టోరియల్, నోడల్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

● **ఆశ్రమ పాఠశాల తనిఖీ**

భైంసా, జనవరి 5: పట్టణంలోని పిప్రి కాలనీ పరిధిలో గల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం రాష్ట్ర పరిశీలన బృందం తనిఖీ చేసింది. గిరిజన సంక్షేమ శాఖ కమిషన్ హైదరాబాద్ ఆదేశాల మేరకు మహజాన్ రమేష్ సారథ్యంలోని రాష్ట్ర పరిశీలన బృందం ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేపట్టింది. ఇందులో భాగంగా పాఠశాలలోని మౌలిక వసతులు, అకాడమిక్ రికార్డులు, లైబ్రరీ, ల్యాబోరేటరి, పాఠశాల పనితీరు, తరగతి బోధన, తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పరీక్షల విభాగాల్లో పలు రికార్డులను పరిశీలించారు.



భైంసాలో విద్యార్థులను వివరాలను సేకరిస్తున్న రాష్ట్ర పరిశీలన బృందం ప్రతినిధులు



లైట్ అప్ 2018

ప్రపంచంలోనే అతి ఎత్తయిన బిల్డింగ్ బుర్జ్‌ఖలీఫా.. మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 2018 నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతూనే గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది.

- బుర్జ్‌ఖలీఫా వేదికగా జరిగిన కొత్త సంవత్సరం వేడుకల్లో 'లైట్ అండ్ సౌండ్ షో' పర్యాటకులకు వినోదం పంచింది.
- కొత్త సంవత్సరం అనగానే ఏ దేశంలో అయినా సాధారణంగా బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుతారు. దానికి భిన్నంగా యూఏఈ మాత్రం దుబాయ్‌లో అదిరిపోయే లైటింగ్‌షోను ఏర్పాటు చేసింది.
- కొత్త సంవత్సరం వేడుకల కోసం దుబాయ్‌లోని బుర్జ్‌ఖలీఫా వద్ద యూఏఈ ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్‌షోకు అనేక ప్రత్యేకతలున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)స్థాపకులు షేక్ జాయేద్ బిన్‌కు నివాళిగా ఈ లైట్ అండ్ సౌండ్ షోను ఏర్పాటు చేశారు. 2018 సంవత్సరాన్ని 'ఇయర్ ఆఫ్ జాయెద్'గా యూఏఈ ప్రకటించింది.
- ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లైట్ అండ్ సౌండ్ షోగా గిన్నిస్ రికార్డులకెక్కింది.

ఈ షోకు 'లైట్‌అప్ 2018' అని పేరు పెట్టారు. ఈ షోను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఐదు నెలల ముందు నుంచే సన్నాహాలు ప్రారంభించారు. మొత్తం 300 మంది నిపుణులు అన్ని రోజుల పాటు పరిశ్రమించి అద్భుతమైన లైటింగ్ దృశ్యాలను ఆవిష్కరించారు.

✧ లైట్‌అప్‌షోకు అవసరమైన వస్తువులను వివిధ దేశాల నుంచి తెప్పించారు.

✧ 7 కి. మీ. పొడవైన విద్యుత్ వైర్లను, 25 కి. మీ. పొడవైన తాళ్లను వాడారు.

✧ నేపథ్య సంగీతాన్ని దుబాయ్, కైరోల్లోని స్టూడియోల్లో రికార్డు చేశారు.

✧ 80 మంది సంగీత కళాకారులు పాల్గొన్నారు.

- బుర్జ్ ఖలీఫా బిల్డింగ్ మొత్తానికి లైట్‌షోతో ఏర్పాటు చేశారు.
- ఇది విస్తీర్ణంలో 20 ఫుట్‌బాల్ మైదానాలంత (సుమారు 27 ఎకరాలు) ఉంటుంది.
- ఇంతకు ముందు ఈ రికార్డు చైనాలోని ఐసీసీ బిల్డింగ్ పేరు మీద ఉంది.

నోరు తిరుగుతోందా?

How much wood, would a woodchuck chuck if a woodchuk, could chuck wood?




పొడుపు కథ

కాళ్లు లేవు గానీ నడుస్తుంది. కళ్లు లేవు గానీ ఏడుస్తుంది. ఏమిటది?



పజిల్ పూరించండి



పద్యం

నిండునదులు పారు నిలిచి గంభీరమై
వెర్రివాగు పారు వేగఁబొర్లి
అల్పుడాడురీతి నధికుండు నాడునా?
విశ్వదాభిరామ వినురవేమ.

భావం : సెలయేరు వేగంగా ప్రవహించి అన్నింటినీ ధ్వంసం చేసినట్టే జ్ఞానం లేని వాడు ఆవేశంతో అన్ని పనులూ చెడగొడుతాడు. వివేకవంతుడు నిండు నది వలె పనులు సక్రమంగా పూర్తి చేస్తాడు.

జంతర్ మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ణపయంరి ▶..............
2. భవంవై ▶..............
3. శ్చితానిర్థం ▶..............
4. ధుబంత్రులుమి ▶..............
5. కరాపోలుక ▶..............

ఆణిముత్యం

ఓర్పు అనేది ఎంత చేదుగా ఉంటుందో, దానివల్ల లభించే ప్రతిఫలం అంత తియ్యగా ఉంటుంది.




జతపరచండి

ఈ ప్రముఖులనూ, వారి స్మారక స్థలాలనూ జతపరచండి

1. మహాత్మాగాంధీ	ఎ. శక్తిస్థల్
2. జవహర్‌లాల్‌నెహ్రూ	బి. విజయ్‌ఘాట్
3. లాల్‌బహదూర్ శాస్త్రి	సి. రాజ్‌ఘాట్
4. ఇందిరాగాంధీ	డి. శాంతివనం
5. బాబూ జగ్జీవన్‌రామ్	ఇ. చైత్రభూమి
6. బి.ఆర్. అంబేద్కర్	ఎఫ్. సమతాస్థల్

పదాలు కనుక్కోండి

shoe
duck
doll
globe
block
green



x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

జంబ్లింగ్ వర్డ్స్



1. LICPOE ______
2. IRF ______
3. RICME ______
4. MMCOISIONRE ______
5. SPINEORCT ______


దారి కనుక్కోండి



ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న వాటిని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!

1. కుక్క
2. DOG
3. कुत्ता



నీడలు గుర్తించండి



జవాబులు

పజిల్ పూరించండి : 17 (కనుక్కోవాల్సిన సంఖ్య ఎదురుగా ఉన్న రెండు అంకెలను కూడాలి 9+8=17), **జతపరచండి:** 1 సి, 2 డి, 3 బి, 4 ఎ, 5 ఎఫ్, 6 ఇ. **జంబ్లింగ్ వర్డ్స్ :** 1. POLICE, 2. FIR, 3. CRIME, 4. COMMISSIONER , 5. INSPECTOR, **పొడుపు కథ :** మేఘం, **జంతర్‌మంతర్ :** 1. పరిణయం, 2. వైభవం, 3. నిశ్చితార్థం, 4. బంధుమిత్రులు, 5. రాకపోకలు

నేత్రపర్వంగా నమ్మల్‌వార్ ఉత్సవాలు


పూజలు చేస్తున్నపండితులు


ఉత్సవాలకు హాజరైన మహిళా భక్తులు

భైంసా, జనవరి 5 : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో నమ్మల్ వార్ పరమ పద ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 12 మెట్లను ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం మెట్ల మీదుగా నమ్మల్‌వార్ వైకుంఠ సమా రాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుడు రంగచారి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆలయ పండితులు చక్రవర్తుల సంతోష్, శ్రీనివాసచార్యులు తిరువాయిమోదీ ప్రబంధ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నమ్మల్‌వార్‌ను స్తుతిస్తూ ఆలపించిన గేయాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

బాసరలో ప్రముఖుల పూజలు

బాసర, జనవరి 5: బాసర సరస్వతీ ఆలయంలో శుక్రవారం పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిపుర రాష్ట్ర డీజీపీ నాగరాజు అమ్మవారిని కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ దామోదర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఇద్దరు ప్రముఖులకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.


బాసరలో అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ దామోదర్‌రెడ్డి



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనంలో ఇక 'బిర్యానీ' ఘుమఘుమలు

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనంలో ఇక వెజ్ బిర్యానీ ఘుమఘుమలాడనుంది. ప్రతి శనివారం కూరగాయలతో తయారుచేసిన బిర్యానీని వడ్డించాలంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వాగతిస్తుండగా, ప్రస్తుతం తమకు చెల్లిస్తున్న రేట్లతో బిర్యానీ కాదు కదా, కూరగాయల భోజనమూ సాధ్యం కాదని వంట ఏజెన్సీలు చెబుతున్నాయి. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున చెల్లిస్తే కచ్చితంగా వండిపెడతామని స్పష్టం చేస్తున్నాయి.

◆ మంచిర్యాల అర్బన్



- ప్రతి శనివారం వడ్డించాలంటూ విద్యాశాఖ ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- ఈ రేట్లతో సాధ్యం కాదంటున్న వంట ఏజెన్సీలు
- ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున చెల్లించాలని డిమాండ్

● మెనూలో మార్పులు..

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజనం మెనూలో సర్కారు పలు మార్పులు చేసింది. ఇకపై ప్రతి శనివారం వెజిటబుల్(కూరగాయల) బిర్యానీ పెట్టాలని నిర్ణయించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్, అన్ని జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించిన కేంద్రబృందం మెనూ మార్చాలని సూచించింది. రకరకాల కూరగాయలు, బఠానీలు, శనగలు, మీల్మేకర్, తదితర పదార్థాలతో బిర్యానీ వండి పెడితే విద్యార్థులు ఇష్టంగా తినడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించినట్లు కూడా ఉంటుందని అభిప్రాయపడింది. ఆమేరకు ప్రతి శనివారం బిర్యానీ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినా అమలుతీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

● ఇదీ మెనూ..

ప్రతి శనివారం ఒకే రకంగా కాకుండా మార్పు ఉండేలా కేంద్ర బృందం మెనూను సూచించింది. బఠానీ పలావ్, కూరగాయలతో కుర్మా, కాబూలీ శనగలు, కూరగాయలతో బిర్యానీ, మీల్మేకర్ బిర్యానీ, కూరగాయలతో కుర్మా, మునగకాయఆకు, పెసరు పప్పుతో కిచిడీ, చెట్నీ, అన్నం, టమాటా, బఠానీల కూర, అన్నం, పెసరు పప్పు, సోయాచిక్కుడు కూర ఉండాలని నిర్దేశించింది.

● సాధ్యమేనా?

కూరగాయల బిర్యానీ పెట్టాలని ఆదేశాలు జారీ చేసిన సర్కారు, ఆమేరకు ఏజెన్సీలకు చెల్లించే ధరల పెంపుపై మాత్రం ఎలాంటి



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వద్ద విద్యార్థులు

నిర్ణయం ప్రకటించలేదు. దీనిపై ఏజెన్సీలు పెదవివిరుస్తున్నాయి. ప్రభుత్వం చార్జీలు పెంచకపోతే శనివారం విజిటెబుల్ బిర్యానీ కాదు కదా, ప్రతిరోజూ కూరగాయలు పెట్టడం కూడా సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నాయి. మార్కెట్లో కూరగాయల ధరలు పెరుగుతుండగా, ఆమేరకు ఏజెన్సీలకు చార్జీలు పెంచకపోవడంతో భోజనంలో నాణ్యత నానాటికీ దిగజారుతున్నది. బడుగు, బలహీనవర్గాల పిల్లలు విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని 2001లో ప్రారంభించింది. లక్ష్యం ఉన్నతంగా, మెనూ గొప్పగా ఉన్నప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో సర్కారు విఫలమవుతూనే వస్తున్నది. 1 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు గుడ్డు పెడితే రూ. 8. పెట్టని రోజు రూ. 4.13 పైసలు, 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గుడ్డు పెడితే రూ.10, పెట్టని రోజు రూ.6.12పైసల చొప్పున ఏజెన్సీలకు చెల్లిస్తున్నది. ఏళ్ల తరబడి ఈ మొత్తాన్ని ప్రభుత్వం పెంచడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో ఏ కూరగాయ ధర చూసినా కిలోకు రూ.50కు తక్కువ లేదు. ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలతో గిట్టుబాటు కాక, నిర్వాహకులు ఆలుగడ్డ, చారు, పలుచని పప్పుకే పరిమితమవుతున్నారు. ఇతర కూరగాయలు లేకపోవడం వల్ల భోజనం రుచించక విద్యార్థులు సగం కడుపుతో సరిపెట్టుకుంటున్నారు.

● కనీసం రూ.15చెల్లిస్తేనే..

మంచిర్యాల జిల్లాలో 720 పాఠశాలలుండగా, 56 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిపై మధ్యాహ్న భోజనం పథకం కింద రోజుకు రూ.4 లక్షలకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. నాణ్యమైన భోజనం అందాలంటే ఒక్కో విద్యార్థిపై కనీసం 15 రూపాయల వంతున చెల్లించాలని ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు అదనంగా ప్రతిరోజూ మరో రూ.2 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇలా చేస్తే భోజనంలో నాణ్యత పెరిగే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఉట్టికెగరలేనమ్మ..

-వెంకటేశ్వర్‌రావు, విద్యార్థి తండ్రి



ప్రభుత్వ నిర్ణయం ఉట్టికి ఎగరలేనమ్మ.. స్వర్గానికి ఎగిరిందట అన్నట్లుగా ఉన్నది. ధరల పెరుగుదలతో ప్రస్తుతం ఉన్న మెనూనే పాటించే పరిస్థితి లేదు. వారానికి మూడుసార్లు గుడ్డు అందడం లేదు. చాలాసార్లు నీళ్ల చారు, ఆలుగడ్డ కూరతోనే సరిపెడుతున్నారు. ఇప్పుడు బిర్యానీ ఎలా పెడుతారు? పెట్టినా నాణ్యత ఉంటుందా? అందువల్ల ఏజెన్సీల సమస్యలు పరిష్కరించి, ఆ తర్వాతే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలి.



భోజనం కోసం క్యూలో ఉన్న విద్యార్థులు

ప్రభుత్వం రేట్లు పెంచితే బిర్యానీ పెడుతాం..

- పుష్పలత, వంట ఏజెన్సీ బాధ్యురాలు, బాలుర పాఠశాల (మంచిర్యాల)



ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం రూ.6 చొప్పున చెల్లిస్తున్నది. కానీ పెరుగుతున్న కూరగాయలు, సరుకుల ధరలతో ప్రస్తుతం ఉన్న మెనూనే కొనసాగించలేకపోతున్నాం. ఈ ధరల్లో ఇక ప్రతి శనివారం వెజ్ బిర్యానీ పెట్టడం ఏమాత్రం సాధ్యం కాదు. గత ఆరు నెలల నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ముందుగా బిల్లులు చెల్లించి, రేట్లు పెంచితే తప్పకుండా బిర్యానీ వండిపెడుతాం.

పిల్లలు ఇష్టంగా తింటారు..

- కిషన్, ప్రధానోపాధ్యాయుడు, బాలుర పాఠశాల



రోజూ పెట్టే భోజనానికి భిన్నంగా శనివారం బిర్యానీ పెడితే విద్యార్థులు ఇష్టంగా తింటారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. మెనూను సక్రమంగా పాటించేలా చర్యలు తీసుకుంటాం.

నాణ్యంగా ఉండాలి..

-డీ అంజలి, విద్యార్థిని



ప్రభుత్వం బిర్యానీని పెడితే మంచిదే. కానీ నాణ్యంగా ఉండాలి. తాజా కూరగాయలు, సరుకులు వాడాలి. లేకుంటే తినే పరిస్థితి ఉండదు.

మంచి నిర్ణయమే కానీ..


- గొర్క సుశీల, వంట ఏజెన్సీ



ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో భాగంగా ప్రతి శనివారం విజిటెబుల్ బిర్యానీ పెట్టాలనుకోవడం మంచి నిర్ణయమే. కానీ అంతకు ముందు ఏజెన్సీలకు చెల్లించే రేట్లను సవరించాలి. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వం సూచించిన మెనూలోని కూరగాయలు, సరుకులు దొరకడం కష్టం. 30, 40 కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అయ్యే రవాణా చార్జీలు చెల్లించాలి. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.15 చెల్లిస్తేనే ఇవన్నీ సాధ్యమవుతాయి.

బిర్యానీ అంటే ఇష్టం..

-ఎండీ నొసీన్, విద్యార్థి




బిర్యానీ అంటే చాలా ఇష్టం. ప్రతి శనివారం పెడితే మంచిదే. కడుపు నిండా తినవచ్చు. ఈ విషయం తెలిసి విద్యార్థులందరూ సంతోషంతో ఉన్నారు. నాణ్యంగా ఉండాలి..

సమస్యల జాతర!

దక్షిణ భారతదేశంలో తొలి ఆదివాసీ ఉత్సవంగా గుర్తింపు పొందిన జంగుబాయి జాతరను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పుష్యమాసం నుంచి ప్రారంభమై, నెలపాటు కొనసాగే వేడుకలకు ఆరు రాష్ట్రాల నుంచి గిరిజనులు తరలివస్తుండగా, కనీస ఏర్పాట్లు కరువయ్యాయి. ఈ క్షేత్రానికి వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. తాగేందుకు మంచినీరు కూడా దొరకని పరిస్థితుల్లో ఆదివాసీ భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు.

◆ కెరమెరి





జంగుబాయి దేవత కొలువైన గుట్ట, (ఇన్‌సెట్‌లో) జంగుబాయి గుహ

- జంగుబాయి క్షేత్రంలో కనీస వసతులు కరువు
- రాళ్లు, ముళ్ల బాటే దిక్కు
- కనిపించని మరుగుదొడ్లు, సత్రాలు
- ఇంకిపోయిన టొప్లకాస వాగు
- తాగునీటికి తండ్లాటే
- గిరిజన భక్తుల అష్టకష్టాలు

● సాహ్యాద్రి కొండల్లో..

కెరమెరి మండలం పరందోళి గ్రామ పంచాయతీ పరిధిలోని మహారాజ్ గూడ అడవుల్లో, సాహ్యద్రి శ్రేణుల నడుమ జంగుబాయి క్షేత్రం ఉన్నది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఈ ఆలయంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. పుష్యమాసంలో ప్రారంభమై, నెలపాటు కొనసాగే జాతరకు తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆదివాసీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, పెం్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది మంది మొక్కులు చెల్లించుకుంటారు.

● ఎటుచూసినా సమస్యలే..

❖ తీవ్ర నీటి ఎద్దడి..

జంగుబాయి సన్నిధిలో నీటి ఎద్దడి తీవ్రమైంది. ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురవక ఇక్కడి టొప్లకాస(వాగు) ఎండి పోయింది. దీంతో భక్తులు రెండు కిలో మీటర్ల దూరంలోని మహారాజ్ గూడ నుంచి ఎడ్లబండ్లపై డ్రమ్ములతో నీళ్లు తెచ్చుకొని తాగునీటికీ, వంటలకూ వాడుకుంటున్నారు. జంగుబాయి దర్శనానికి ముందు గిరిజన సంప్రదాయం ప్రకారం, టోప్లకాస నీటితో కాళ్లు శుభ్రం చేసుకోవడం ఆనవాయితీ. కానీ టొప్లకాసలో నీళ్లు లేకపోవడంతో ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు బోర్లు ఏర్పాటు చేసి, నీటి సమస్య తీర్చాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.



జంగుబాయి క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న భక్తులు(ఫైల్)

❖ రాళ్లు, ముళ్ల పైనే నడక..

భక్తులు కెరమెరి నుంచి అనార్‌పల్లి, పరందోళి మీదుగా క్షేత్రానికి వెళ్తారు. సుమారు 40 కిలో మీటర్ల దూరంలో జంగుబాయి గుహ ఉంటుంది. ఉమ్రి వరకు తారు రోడ్డు ఉన్నా మరో 20 కిలో మీటర్లు కచ్చా రోడ్డే దిక్కవుతున్నది. అందులో అయిదు కిలో మీటర్లు పూర్తిగా రాళ్లు రప్పలు, ముళ్లతో ఉంటుంది. భక్తులు ఎలాంటి పాదరక్షలు ధరించకుండా రావడం ఆచారం. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

❖ చలిలో వణుకుతూ..

జంగుబాయి క్షేత్రం వద్ద కేవలం రెండు సత్రాలే ఉండగా, సరిపోవడం లేదు. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులు రెండు రోజుల పాటు ఆరుబయట చలిలో వణుకుతూ ఉంటున్నారు. అదనపు సత్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను అధికారులు పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం ఎంపీ నగేష్ ఆలయానికి వెళ్లేందుకు కొద్ది దూరం సీసీ రోడ్డు వేయించి, తొమ్మిది సోలార్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత ఈ క్షేత్రంవైపు కన్నెత్తి చూసినవారు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యలను తీర్చాలని ఆదివాసీలు కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

- మరప బాజీరావు, జంగుబాయి ఆలయ కమిటీ చైర్మన్



జంగుబాయి ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ నిర్మాణం కోసం రూ.10 లక్షలు కేటాయించినా, ఇతర నిర్మాణాలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిధులు కేటాయిస్తే సత్రాల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్యను తీర్చవచ్చు.

గూండాయిజంపై తిరుగుబావుటా..

కోల్‌బెల్ట్ ప్రాంతంలో భూస్వాముల దాష్టీకాలకు, గూండాయిజానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటది.. 1979 జనవరి 5న మందమర్రిలో కార్మికుల శాంతియుత నిరసనకు, గూండాల కవ్వింపు తోడై, పరిస్థితి అదుపుతప్పింది. కార్మికుల ఆధ్వర్యంలో భూస్వాముల ఆస్తుల విధ్వంసం సాగుతుండగా, రంగప్రవేశం చేసిన పోలీసులు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులు నేలకూలగా, 18 మందితీవ్రంగా గాయపడ్డారు. ఇది జరిగి 39 ఏండ్లు గడుస్తుండగా, నేటికీ నాటి జ్ఞాపకాలను కార్మికులు నెమరేసుకుంటున్నారు. ప్రాణాలు కోల్పోయిన సహచర కార్మికులకు నివాళులర్పిస్తున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల

- మందమర్రి కాల్పులకు 39 ఏండ్లు
- నాటి చేదు జ్ఞాపకాలను నెమరేసుకుంటున్న కార్మికులు
- అమరుల కోసం స్తూపం నిర్మించాలని డిమాండ్

● ఆ రోజు ఏం జరిగిందంటే..

మందమర్రిలోని కేకే 1 సీఎస్‌పీ వద్ద కాంటాలో పనిచేసే లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుల నుంచి కమీషన్ పేరిట కొందరు బలవంతంగా డబ్బులు వసూలుచేస్తున్నారని కొందరు కార్మికులు చెప్పడంతో 1979 జనవరి 5న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వీటీ అబ్రహం, ఉండేటి స్వామి, బండి బోజాలు, సాంబయ్య, ఎండీ సందాని, మల్లేశ్, కనకయ్య, మరికొందరు యువజన సమాఖ్య నాయకులు ఘటనాస్థలికి వెళ్లారు. ఈ కమీషన్ దందాకు వ్యతిరేకంగా యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అప్పటికే ఆందోళనలు జరగుతున్నాయి. కమీషన్ ఏజెంట్లు, కొందరు గూండాలు స్థానిక భూస్వామి వద్ద ఉంటూ ఆగడాలు సాగించేవారు. వీరంతా ముందస్తు ప్రణాళిక ప్రకారం, వీటీ అబ్రహం, తదితరులపై గొడ్డళ్లు, కత్తులతో దాడిచేశారు. ఈ దాడుల్లో వీటీ అబ్రహంతో పాటు మరో యువజన నాయకుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కార్మికులు ఆసుపత్రికి తరలించారు. ఈ వార్త విన్న కార్మికులు ఉదయం జనవరి 6న బొగ్గు బావులు బంద్ చేసి ఆందోళనకు దిగారు. భారీ ర్యాలీ తీసి, స్థానిక భూస్వామికి చెందిన సినిమాహాల్‌ను ధ్వంసం చేసి, తగుల బెట్టారు. భూస్వామి అనుచరుల ఇండ్లను, బ్రాందీ షాపులను, సారా దుకాణాలనూ ధ్వంసం చేస్తూ ముందుకు సాగారు. నాగ్‌పూర్ - హైదరాబాద్ రహదారిపైకి ర్యాలీ చేరగానే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ నెలకొన్నది. దీంతో అప్పటి మంచిర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాంరెడ్డి నేతృత్వంలో పోలీసులు కార్మికులపై కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులు మృతిచెందగా 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాటం చంద్రయ్య, శీలంశెట్టి నారాయణ, ఎస్ చంద్రయ్య, దుర్గయ్య, మరో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు.



మందమర్రిలో కాల్పులు జరిగిన నాగ్‌పూర్ - హైదరాబాద్ రహదారి ఇదే

● కాల్పుల అనంతరం కేసుల చుట్టూ..

కాల్పుల్లో ఆరుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయినా, పద్దెనిమిది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డా పోలీసులు విడిచిపెట్టలేదు. వందలాది మంది కార్మికులు, కార్మిక నేతలపై కేసులు నమోదు చేశారు. వారంతా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. కేసులు నమోదైనవారిలో సీపీఐ నేత గుండా మల్లేష్, మావోయిస్టు నేత గజ్జెల గంగారాం, సీపీఐ యువజన నాయకులు అయ్యవారి కిష్టయ్య, ఉండేటి స్వామి, సందాని, శ్యామ్‌రావు, ఎస్ రాజయ్య, నామిని శంకరయ్య, చుక్కల రాజం, అహ్మద్ అలీ, యాదగిరి, దొంతుల రాజం, చిప్ప నర్సయ్య తదితరులున్నారు.

● మానని గాయం..

ఈ ఘటన జరిగి, 39 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ మానని గాయమై కార్మికులను సలుపుతూనే ఉన్నది. తమ సహచరులను కోల్పోయిన కార్మికులు ఏటా నివాళులర్పిస్తున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో మరీ ముఖ్యంగా మందమర్రి లాంటి పట్టణాల్లో గూండాయిజం నశించేందుకు ఈ ఘటన దోహదం చేసిందని చెప్పవచ్చు.

సంఘటన అనంతరం కార్మికుల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన స్తూపాన్ని కూల్చివేశారు. దీనిని తిరిగి నిర్మిస్తామని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ నల్లాల ఓదెలు హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోవడం లేదు.